


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 160 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 14 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :160 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 14 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును
# జాతికి అంకితం చేస్తాం

- నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు: సీఎం చంద్రబాబు
- నల్లమలసాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం సరికాదన్న సీఎం చంద్రబాబు
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం
- ఆరోగ్య సేవల మెరుగుకు సంజీవని.. ఫిబ్రవరి 16న రాష్ట్రానికి బిల్ గేట్స్
- విశాఖకు గూగుల్, టీసీఎస్.. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ భారీ రిఫైనరీ



**పెన్ పవర్ డెస్క్:**పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడం సమర్థనీయం కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏటా 3,500 టీఎంసీల గోదావరి వరద నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, అందులోంచి 200 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఈ ప్రాజెక్టుకు అడ్డుపడటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, పోలవరాన్ని వంశధారతో అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన 20 నెలల్లో తమ సంకీర్ణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో గణనీయమైన ప్రగతి సాధించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని వివరించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఎదురైన ఇబ్బందులను అధిగమించిన తీరును, అభివృద్ధిని అడ్డుకోవడానికి జరుగుతున్న కుట్రలను సభలో ప్రస్తావించారు.

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ముందుందని, గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు విశాఖకు వస్తున్నాయని చెప్పారు. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రామాయపట్నం వద్ద రూ.70,000 కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కచ్చితంగా నెరవేరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ప్రజారోగ్య సేవలను మెరుగుపరిచేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొస్తున్నామని, ఇందులో భాగంగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తామని తెలిపారు. ఈ నెల 16న బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటనకు రానున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు.



రణవీర్ సింగ్ ను చంపేస్తామంటూ

## బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

- డైరెక్టర్ రోహిత్ శెట్టికి కూడా వార్నింగ్
- వారి వద్ద పనిచేస్తున్న వారిని హత్య చేస్తామని హెచ్చరిక
- వాట్సాప్ లో ఆడియో మెసేజ్ పంపిన దుండగుడు

మిగతా2లో



## ఇప్పుడైనా చెప్పండి... అవి చిన్న మాటలా?

- మండలిలో నిప్పులు చెరిగిన నారా లోకేశ్
- ముఖ్యమంత్రి తల్లిపై అంబటి వ్యాఖ్యలు చిన్న మాటలా అని ప్రశ్నించిన లోకేశ్
- శాసనమండలిలో వైసీపీ ఆరోపణలను తీవ్రంగా తిప్పికొట్టిన మంత్రి
- మహిళలను కించపరిస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదని స్పష్టం
- భారతీరెడ్డి విషయంలో తమ చిత్తశుద్ధిని గుర్తుచేసిన లోకేశ్
- అంబటి వ్యాఖ్యలు తప్పో ఒప్పో తేల్చాలంటూ వైసీపీకి సవాల్

**పెన్ పవర్ డెస్క్:**"ఒక తల్లిని అవమానిస్తూ మాట్లాడితే అవి రెండు చిన్న మాటలు ఎలా అవుతాయి?" అంటూ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి తల్లిని కించపరిచేలా

మిగతా2లో



ఒక్క ఓటుతో వరించిన

## విజయం

- కల్వకుర్తి మున్సిపాలిటీ పదో వార్డు ఫలితాలు
- కాంగ్రెస్ అభ్యర్థికి 259, బీఆర్ఎస్ అభ్యర్థికి 258 ఓట్లు
- పరకాలలోనూ ఒక్క ఓటుతో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర ఫలితాలు వెలువడుతున్నాయి. ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతను మార్చేసింది. రెండు చోట్ల ఒక్క ఓటుతో

మిగతా2లో

## జగన్ ఒక 'మర్చంట్ ఆఫ్ డెత్'... సోమిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు



- వైసీపీ అధినేత జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' అంటూ అభివర్ణించిన సోమిరెడ్డి
- జగన్‌కు విధ్వంసం, శవ రాజకీయాలంటే ఇష్టమని తీవ్ర ఆరోపణ
- ర్యాలీల్లో చనిపోయిన కార్యకర్తలను కూడా పరామర్శించరని విమర్శ
- తల్లిదండ్రులను దూషించే వారిని శిక్షించేలా ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్




వచ్చేది వేసవి కాలం...

## నిప్పుతో జాగ్రత్త

- వేసవి దృష్ట్యా అగ్ని ప్రమాదాలపై హైడ్రా అవగాహన కార్యక్రమాలు
- కేవలం 30 సెకన్లలో మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని రంగనాథ్ వెల్లడి
- నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణం అని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అగ్ని ప్రమాదాల పట్ల నగర ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. నిప్పుతో ఊహించని ప్రమాదం పొంచి ఉంటుందని, ప్రతిఒక్కరూ అగ్నిమాపక నిబంధనలను తప్పనిసరిగా

మిగతా2లో

అంబటి రాంబాబు తల్లిని తిడితే ఒకటి...

## మీ తల్లిని అంటే ఒకటా?

- శాసనమండలిలో అంబటి అంశంపై మాట్లాడిన బొత్స
- అంబటిపై దాడి చేయడం వల్లే ఆయన ఘాటుగా స్పందించారని వ్యాఖ్య
- అంబటిని వేధించిన వారంతా మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ రాజకీయాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్ వ్యవహారం వేడి పుట్టిస్తోంది. ఈ అంశంపై శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై


మిగతా2లో



# నీట్ ఆధారంగా నర్సింగ్ ప్రవేశాలు

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- బీఎస్‌ఈ నర్సింగ్ ప్రవేశాలపై కీలక నిర్ణయం
- నీట్-యూజీ పరీక్ష ఆధారంగా ప్రవేశాలు
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఎం చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:**విద్యా రంగానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలను నీట్-యూజీ పరీక్ష ఆధారంగా నిర్వహించాని నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ పరీక్షను విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉన్నతాధికారులతో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నర్సింగ్ ప్రవేశాలకు ఉత్తమ విధానంపై చర్చించారు. అనంతరం నీట్ పై కీలక నిర్ణయం తీసుకున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బోణి కొట్టిన జనసేన

- మున్సిపల్ ఎన్నికల్లో 200కు పైగా స్థానాల్లో జనసేన పోటీ
- సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో జయకేతనం
- స్థానిక నాయకత్వం, కార్యకర్తల కృషితో జనసేన గెలుపు





మిగతా2లో

## ఇరాన్ దిశగా కదులుతున్న అమెరికా సేనలు...

- అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు
- యూఎస్ఎస్ జెరాల్డ్ ఫోర్డ్ నౌకను మధ్యప్రాచ్యానికి తరలింపు
- ఇప్పటికే అక్కడ ఉన్న అబ్రహం లింకన్ నౌకకు తోడుగా ఇది రెండో విమానవాహక నౌక
- అణు చర్చలు విఫలమైతే సైనిక చర్య తప్పదని ఇటీవలే ట్రంప్ హెచ్చరిక
- ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం
- అమెరికా చర్యతో పశ్చిమాసియాలో కొత్తగా ఆందోళనలు

మిగతా2లో



## తిరుమలలో అపచారాలకు నాటి పాలక మండలే కారణం




- రూ.10 కోట్లతో నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్
- పాలకమండళ్లు బాధ్యతగా ఉంటే ఆలయాల్లో అపచారాలు జరగవని వ్యాఖ్య
- గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో అనేక తప్పులు జరిగాయని విమర్శ
- ఆలయాల అభివృద్ధి, ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడి
- రూ.40 కోట్లతో 22 ప్రధాన ఆలయాలకు రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటన

మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# పవన్ సర్.. ఇటో లుక్కేయండి ప్లీజ్!

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటో లుక్కేయాలంటూ.. దేవదాయ శాఖ అధికారులు కోరుతున్నారు. ప్రస్తుత ఉపముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్.. అటవీ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అటవీ శాఖ అధికారులకు.. దేవదాయశాఖ అధికారులకు మధ్య ఓ వివాదం తలెత్తింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే.. ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితులు తప్పవని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని సదరు సమస్యను పరిష్కరించాలని దేవదాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

**విషయం ఏంటంటే..**

ప్రస్తుతం నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలో .. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మరో రెండు రోజుల్లోనే మహాశివరాత్రి వేడుకలు కూడా జరగనున్నాయి. శ్రీశైలం దేవస్థానానికి చేరుకునే దుకు భక్తులకు అనేక మార్గాలు ఉన్నాయి. అయితే.. ఆదినుంచి వస్తున్న ఆచారంలో భాగంగా ఇప్పటికీ కొన్ని వేల మంది భక్తులు.. నడక మార్గంలో శ్రీశైలానికి చేరుకుంటున్నారు. ఇలా నడక మార్గంలో వచ్చేవారు.. నల్లమల అడవిలో 46 కిలో మీటర్ల మేరకు నడవాలి.

ఈ నేపథ్యంలో అటవీ మార్గంలో నడిచే భక్తులకు ఆ శాఖ అధికారులే భద్రత కల్పించాలి. అలాగే.. భక్తుల కు అవసరమైన భోజనం, నీరు. టీ వంటివాటిని కూడా ఏర్పాటు చేయాలి. ఈ ఏడాది మాత్రం అటవీ శాఖ అధికారులు రివర్స్ అయ్యారని దేవదాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం.. ఆయా ఏర్పాట్లు చేసేందుకు అటవీ శాఖకు నంద్యాల జిల్లా అధికారులు 5-6 లక్షలవరకు చెల్లిస్తున్నారు. కానీ, ఈఏడాది మాత్రం 60 లక్షల రూపాయలు చెల్లించాలని అటవీ అధికారులు పట్టుబట్టారు. దీంతో ఇరు శాఖల మధ్య వివాదం ముదిరింది. మరోవైపు రెండు రోజుల్లోనే మహా శివరాత్రి వేడుక రానుంది. దీంతో అటవీ మార్గంలో వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. అటవీ శాఖ అధికారుల సహకారం లేకపోవడంతో భక్తులకు సరైన భద్రత, రక్షణ కల్పించలేక పోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేకపోతే.. భక్తులకు ఏదైనా జరిగితే.. అది సర్కారు మొత్తానికీ చెడ్డ పేరు తెస్తుందని హెచ్చరిస్తున్నారు.

# ఇప్పుడైనా చెప్పండి... అవి చిన్న మాటలా?

- మొదటి పేజి తరువాయి

వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబును అరెస్ట్ చేయడాన్ని సమర్థించారు. వైసీపీ అధినేత జగన్ ఈ అంశాన్ని చిన్నదిగా చూపే ప్రయత్నం చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. శు క్రవారం నాడు శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, బొమ్ము ఇజ్రాయేల్ చేసిన ఆరోపణలను లోకేశ్ గట్టిగా తిప్పికొట్టారు. అధికార, ప్రతిపక్ష సభ్యులెవరైనా మహిళలను కించపరిచేలా మాట్లాడకూడదని, అలాంటి వారిని ఎవరూ ప్రోత్సహించవద్దని ఆయన సభకు విజ్ఞప్తి చేశారు. "ఇప్పుడైనా చెప్పండి, అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు తప్పా ఒప్పా? మీరు దాన్ని సమర్థిస్తున్నారా?" అని వైసీపీ సభ్యులను సూటిగా ప్రశ్నించారు. జగన్ రెడ్డి తల్లి అయినా, ఎవరి తల్లైనా, అక్కాచెల్లెళ్లయినా వారిని కించపరిస్తే ప్రజాప్రభుత్వం సహించబోదని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారని లోకేశ్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "మాజీ మంత్రి అంబటి రాంబాబు గౌరవ ముఖ్యమంత్రి గారి తల్లిని అవమానించారు. ఇది వాస్తవమా కాదా? ముఖ్యమంత్రి తల్లిని అంత దారుణంగా మాట్లాడితే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? అలాంటి వాళ్లను వదిలిపెడతామా? సభ లోపలైనా, బయటైనా మహిళలను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని స్పష్టం చేశారు. మహిళల గౌరవానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ అంశాన్ని తేలికపరిచే ప్రయత్నం చేస్తున్నారని లోకేశ్ మండిపడ్డారు. "అంబటి రాంబాబు కేవలం రెండు చిన్న మాటలు అన్నారని జగన్ రెడ్డి ప్రెస్ మీట్‌లో చెప్పడం సిగ్గుచేటు. ఒక తల్లిని అవమానిస్తూ మాట్లాడిన మాటలు చిన్నవి ఎలా అవుతాయి? సొంత తల్లిని, చెల్లిని గౌరవించే అలవాటు మీకు లేకపోవచ్చు, కానీ మాకు ఆ సంస్కారం ఉంది, బాధ్యత ఉంది. మహిళల జోలికి వెళితే వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని లోకేశ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయంలో తమ ప్రభుత్వం ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం లేదని, కేవలం మహిళల గౌరవాన్ని కాపాడేందుకే

కఠినంగా వ్యవహరిస్తోందని వివరించారు.

తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని వివరిస్తూ, "మా సొంత పార్టీ కార్యకర్త ఒకరు వైఎస్ భారతీరెడ్డి గారి గురించి సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే, తక్షణమే చర్యలు తీసుకుని జైలుకు పంపించాం. అదీ మహిళల పట్ల మాకున్న గౌరవం, మా చిత్తశుద్ధి. కానీ మీరు ఐదేళ్లలో ఏం చేశారు? మా పార్టీ కార్యాలయంపై దాడి చేసినప్పుడు, ఇదే సభలో మా తల్లిని అవమానించినప్పుడు మీరు ఏం చర్యలు తీసుకున్నారు?" అని లోకేశ్ వైసీపీ నేతలను నిలదీశారు.

## జగన్ ఒక 'మర్చంట్ ఆఫ్ డెత్'... సోమిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. వైసీపీ అధినేత జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' (మృత్యు వ్యాపారి) అని అభివర్ణించారు. జగన్‌కు విధ్వంసం, శవ రాజకీయాలు అంటే ఎంతో ఇష్టమని సోమిరెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. "డిక్కీలో శవాన్ని వేసుకుని వచ్చిన తన ఎమ్మెల్సీ భుజాన్ని తట్టే నైజం జగన్‌ది. తన ర్యాలీలోనే కార్యకర్తలు చనిపోతే కనీసం పరామర్శకు వెళ్లరు. కానీ, బూతులు తిట్టిన వారిని మాత్రం పరామర్శిస్తారు. ర్యాలీలు చేపట్టి ఒకరిద్దరు చనిపోయేలా చేస్తారు. అందుకే జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' అంటాను" అని తీవ్రంగా విమర్శించారు. కేవలం శవ రాజకీయాలు చేసేందుకే జగన్ తన పార్టీని స్థాపించారని ఆయన ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థుల తల్లిదండ్రులను దూషించిన వారిని జగన్ కనీసం కట్టడి చేయరని సోమిరెడ్డి మండిపడ్డారు. రాజకీయాల్లో ఇలాంటి సంస్కృతి మంచిది కాదన్నారు. నేతల తల్లిదండ్రులను దూషించే వారిని కఠినంగా శిక్షించేందుకు వీలుగా రాష్ట్రంలో ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రణవీర్ సింగ్ ను చంపేస్తామంటూ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

బాలీవుడ్ లో ప్రముఖ నటుడు రణ్ వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్ వీర్ ను, అతడి వద్ద పనిచేస్తున్న వారినీ చంపేస్తానని దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇదే తరహా బెదిరింపులు చేశాడు. ఈ మేరకు వాట్సాప్ లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ మెసేజ్ తో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్లను అంగీకరించకపోతే వారితో పాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు.

**మెసేజ్ లో ఏముందంటే..**

"రణ్ వీర్ సింగ్.. నీ భవిష్యత్తులో ఏడు తరాలు గుర్తుండిపోయేలా నిన్ను హత్య చేస్తాం. నువ్వు మా బెదిరింపులను లెక్క చేయకపోగా మిగతా వారికీ ఉచిత సలహాలు ఇస్తున్నావు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నావు. నువ్వు కూడా ఓ కంప్లైంట్ చేసినట్టున్నావు.. పర్వాలేదు. ఇక నీకు మామూలుగా చెప్పం. నీ దగ్గర ఎవరెవరు పనిచేస్తున్నారు. వారు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళతారు.. వారి కుటుంబాలు ఎక్కడ ఉంటున్నాయనే వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి. వారితో మొదలు పెడతాం. ఒక్కొక్కరినీ టార్గెట్ చేసి చంపేస్తుంటే అప్పుడు నీకు తెలిసివస్తుంది. నీకు ఇంకా టైముంది. హత్యలు మొదలయ్యే లోపే మేలుకో" అంటూ దుండగుడు బెదిరించాడు. దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇది వర్తిస్తుందని హెచ్చరించాడు.

# ఇరాన్ దిశగా కదులుతున్న అమెరికా సేనలు...

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకుంటున్న వేళ, ట్రంప్ ప్రభుత్వం తమ సైనిక శక్తిని ప్రదర్శిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక అయిన యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను కరేబియన్ సముద్రం నుంచి మధ్యప్రాచ్యం వైపు తరలిస్తోంది. ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ చర్య తీసుకున్నట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇరాన్‌తో అణు కార్యక్రమంపై చర్చలు విఫలమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు కొలిక్కి రాకపోతే దాడులకు దిగేందుకైనా సిద్ధమేనని అమెరికా సంకేతాలిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో ఇప్పటికే యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక సమూహం మోహరించి ఉంది. ఇప్పుడు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరనుండటంతో ఆ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు శక్తివంతమైన విమాన వాహక నౌకలు అందుబాటులో ఉంటాయి.

న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం, కరేబియన్‌లో ఉన్న జెరాల్డ్ ఫోర్డ్ స్ట్రైక్ గ్రూప్... అట్లాంటిక్ మహాసముద్రం, మధ్యధరా సముద్రం మీదుగా పర్షియన్ గల్ఫ్ వైపు పయనిస్తోంది. ఈ నౌకతో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి అత్యాధునిక డిస్ట్రాయర్లు కూడా ఈ బృందంలో ఉన్నాయి. ఈ విమానవాహక నౌక మే నెల ఆరంభం వరకు మధ్యప్రాచ్యంలోనే ఉండే అవకాశం ఉందని, దీంతో దీని మోహరింపు కాలం 10 నెలలకు

పొడిగించవచ్చని తెలుస్తోంది. గతంలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించేందుకు అమెరికా చేపట్టిన సైనిక చర్యలో జెరాల్డ్ ఫోర్డ్ నుంచే యుద్ధ విమానాలు పాల్గొన్నాయని నివేదికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకే అమెరికా ఈ చర్య తీసుకుందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ భారీ యుద్ధ నౌక తరలింపు పశ్చిమాసియాలో కొత్త ఆందోళనలకు దారితీస్తోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

## ఒక్క ఓటుతో వరించిన విజయం

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ అభ్యర్థులను విజయం వరించింది. కల్వకుర్తి మున్సిపాలిటీలోని పదో వార్డులో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య విజయం దోబూచులాడింది. తొలుత కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ కు రెండు ఓట్ల మెజారిటీ రాగా బీఆర్ఎస్ అభ్యర్థి తాహిర్ రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు మరోసారి ఓట్లు లెక్కించగా.. ఎజాస్ కు 259 ఓట్లు, తాహిర్ కు 258 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

**పరకాలలో..**

పరకాల మున్సిపాలిటీలోని 17వ వార్డు ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్రకు 369 ఓట్లు పోలవగా.. బీఆర్ఎస్ అభ్యర్థి శనిగరపు రజినికి 368 ఓట్లు వచ్చాయి. దీంతో రజిని రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకోగా రెండోసారి కౌంటింగ్ చేసినా ఫలితంలో మార్పులేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్ర గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

## తిరుమలలో అపచారాలకు నాటి పాలక మండలే కారణం

పాలక మండళ్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే దేవాలయాల్లో ఎలాంటి అపచారాలు, తప్పులు జరగవని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల వంటి పుణ్యక్షేత్రంలోనే ఎన్నో అపచారాలు జరిగాయని, నాటి పాలక మండలి సరిగ్గా పనిచేసి ఉంటే ఆ పరిస్థితి వచ్చేది కాదని ఆయన విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా ఆలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సూచించారు. శుక్రవారం సచివాలయం నుంచి శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, దేవాదాయ శాఖ కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "మన ఆలయాలు నాగరికతకు, సంస్కృతికి, వారసత్వానికి చిహ్నాలు. వాటి పరిరక్షణ మనందరి బాధ్యత. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేతృత్వంలో ఆలయాల అభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం," అని అన్నారు. అరుణాచలంలో మాదిరిగా శ్రీకాళహస్తిలోనూ గిరిప్రదక్షిణ చేయాలన్న కోరిక తనకు ఉందని, త్వరలోనే క్షేత్రాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గనిర్దేశకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. దేవాదాయ శాఖ సహకారంతో రూ.40 కోట్లకు పైగా నిధులతో 22 ప్రధాన దేవాలయాలకు రహదారి వసతి కల్పిస్తున్నామని తెలిపారు. కోటప్పకొండ, వాడపల్లి సహా అనేక క్షేత్రాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం గిరిప్రదక్షిణ మార్గంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని చెప్పారు. అరుణాచలం తరహాలో ప్రతి పౌర్ణమికీ శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించాలని నూతన పాలక మండలికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నుంచి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఇతర అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# వచ్చేది వేసవి కాలం... నిప్పుతో జాగ్రత్త

- మొదటి పేజి తరువాయి

పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఓ అవగాహనా కార్యక్రమంలో ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, "కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే మంటలు వేగంగా వ్యాపించే అవకాశం ఉంది. నగరంలో గతంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాలను విశ్లేషిస్తే, నిబంధనలను ఉల్లంఘించడమే ప్రధాన కారణంగా స్పష్టమవుతోంది" అని తెలిపారు. వేసవిలో పొడి వాతావరణం కారణంగా ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో హైడ్రా అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని కమిషనర్ వివరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తేనే ప్రమాదాలను నివారించగలమని, తద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని అరికట్టవచ్చని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బోణి కొట్టిన జనసేన

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బోణి కొట్టింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో జనసేన అభ్యర్థి సమీప ప్రత్యర్థిపై విజయకేతనం ఎగురవేశారు. ఈ విజయం జనసేన శ్రేణుల్లో మంచి ఉత్సాహాన్ని నింపింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నేరుగా ప్రచారంలో పాల్గొనకపోయినా, స్థానిక నాయకత్వం, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చేసిన కృషి ఈ గెలుపుకు కీలకంగా నిలిచింది. ముఖ్యంగా యువత, మార్పు కోరుకునే ఓటర్లు జనసేన వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేనకు ఈ విజయం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నేరేడుచర్లలో జనసేన కార్యకర్తల్లో ఇప్పుడు కొత్త ఉత్తేజం కనిపిస్తోంది. మొత్తం 200కు పైగా స్థానాల్లో పోటీ చేసిన జనసేనకు ఈ మొదటి గెలుపు మంచి ఊపునిస్తోంది.

## 'వందేమాతరం' పూర్తి గీతాన్ని పంచుకున్న విజయసాయిరెడ్డి... కీలక వ్యాఖ్యలతో ట్వీట్!

ఇప్పటివరకు మనం పాడుతున్న వందేమాతరం గీతం సగమేనని తెలుసా?... అయితే పూర్తి గీతం ఎలా ఉంటుందో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో పంచుకున్నారు. వందేమాతరం' పూర్తి గీతాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు పాడిన సగం గీతం బానిసత్వానికి నిదర్శనమని, ఈ దుస్థితిని మార్చి పూర్తి 'వందేమాతరం' గీతాన్ని ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ సమర్థించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయసాయి తన అభిప్రాయాన్ని వివరిస్తూ, "విదేశీ పాలకులు వెళ్లిపోయినా, విదేశీ మతాలు మన మధ్యే మిగిలిపోయాయి. అవి మన సంస్కృతిపై పరిపాలన చేయాలని చూస్తున్నాయి. భారతదేశంలో పుట్టిన మనకు మనసు ఉండదా? ఇప్పటికీ బానిసత్వపు సంకెళ్లేనా?" అని ప్రశ్నించారు. గత 120 సంవత్సరాలుగా విదేశీ మతాల వారు ఏమనుకుంటారోనన్న భయంతోనే సగం 'వందేమాతరం' గీతాన్ని పాడామా..? అని ఆయన నిలదీశారు. "మన జాతీయ గేయంలో మన అమ్మవార్ల పేర్లు ఉండకూడదా?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని మార్చి, పూర్తి 'వందేమాతరం' గీతాన్ని పాడాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని విజయసాయిరెడ్డి కోరారు.

# అంబటి రాంబాబు తల్లిని తిడితే ఒకటి... మీ తల్లిని అంటే ఒకటా?

- మొదటి పేజి తరువాయి

విమర్శలు గుప్పించారు. అంబటి రాంబాబు తల్లిని తిడితే ఒకటి... మీ తల్లిని అంటే ఒకటా? అని ఆయన ప్రశ్నించారు. మహిళల విషయంలో ఎవరు తప్పు చేసినా తప్పేనని అన్నారు. అంబటి రాంబాబు తల్లిని తిట్టిన వీడియోలు ఉన్నాయని తెలిపారు. అంబటిపై దాడి చేయడం వల్లే ఆయన ఘాటుగా స్పందించారని బొత్స అన్నారు. ఆయన విజ్ఞత కలిగిన వ్యక్తి కాబట్టే క్షమాపణ చెప్పారని తెలిపారు. అంబటిని వేధించిన వారంతా భవిష్యత్తుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల ఇళ్లపై దాడి చేయడం సరికాదని అన్నారు. మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై కూడా దాడి చేశారని విమర్శించారు. మహిళలను బయటకు తీసుకొచ్చి రాజకీయ మైలేజీ కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

# అంబటి పై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వ విప్.

**అంబటి రాంబాబులో ఎలాంటి పశ్చాతాపం కనిపించడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం.**



**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 13 పెన్ పవర్.** ఇదేం తీరు? అంటూ వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు.కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలన్నారు.అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని పేర్కొన్నారు.అయితే వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలకు అలవాటు పడి,రాయడానికి కూడా వీలులేని రోత మాటలతో ప్రజల చేత ఛీ కొట్టించుకునే స్థితికి దిగజారుతున్నారని తీవ్రంగా విమర్శించారు.ఎన్ని సార్లు హెచ్చరించినా,ఎంతటి పరిస్థితులు ఎదురైనా వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై తీవ్ర పదజాలంతో దూషించిన కేసులో అరెస్ట్ అయి జైలు జీవితం అనుభవించిన తరువాత కూడా అంబటి రాంబాబులో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.కోర్టు రిమాండ్ అనంతరం బయటకు వస్తూ బాధ్యతారహితంగా ప్రవర్తించడం వైసీపీ "రప్పా రప్పా రాజకీయానికి" నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించారు.మహిళలపై నీచంగా మాట్లాడటం మాత్రమే కాకుండా,తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చట్టబద్ధంగా ప్రభుత్వ కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరించారు

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## 17న నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి




**ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు సూచన**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 13:**అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశమైన జీకే వీధి ఎంపీడీవో బి హెచ్ వి రమణబాబు 17వ తారీఖున నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఆయన తెలిపారు, అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల పిల్లల వరకు వారి ఎదుగుదల మరియు బరువులను ఎప్పటికప్పుడు గమనిస్తూ నమోదు చేయడం అవసరమని. ఎప్పటికప్పుడు నమోదు చేయకపోతే కొంతమంది తప్పుడు లెక్కలు వేయడంతో సేవలు అందించే ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు.అలాగే నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సమయానికి, జాగ్రత్తగా నిర్వహించి దాని విజృంభణను ప్రజల్లో చక్కగా తెలియజేయాలని ఎంపీడీవో కోరారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు వలసమ్మ, మోహిని, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్ చేస్తాం

**గూడెం కొత్తవీధి ఎస్ఐ సురేష్ హెచ్చరిక**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 13:**అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం మీదుగా ప్రయాణించే వాహనదారులు తమ వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని, లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని గూడెం కొత్తవీధి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్ హెచ్చరించారు.మండలంలోని పలు ప్రాంతాల్లో నంబర్ ప్లేట్లు లేని వాహనాలు అధికంగా సంచరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. అలాంటి వాహనాలు పట్టుబడితే వెంటనే అదుపులోకి తీసుకుని సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.అలాగే ఒడిశా,ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల యజమానులు సంబంధిత పత్రాలను వాహనాల్లో తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. అవసరమైన రికార్డులు లేని వాహనాలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని తెలిపారు.మండలంలో ఎక్కడైనా నంబర్ ప్లేట్లు లేని వాహనాలు కనిపించినా కఠిన చర్యలు తప్పవని, ఈ విషయంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు.

## విధులకు డుమ్మా కొట్టిన సిబ్బందికి మెమోలు జారీ

**జీకే వీధి ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు ఆకస్మిక తనిఖీ**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 13:** అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని ఆర్వి నగర్ గ్రామ సచివాలయాన్ని శుక్రవారం జీకే వీధి ఎంపీడీవో బి హెచ్వి రమణబాబు మరియు డిప్యూటీ ఎంపీడీవో జగదీష్ సందర్శించారు.సచివాలయం రికార్డులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించినప్పుడు ముగ్గురు సచివాలయం సిబ్బంది విధులకు హాజరు కాలేదని గుర్తించారు. దీంతో విధులకు హాజరు కాని ఆ ముగ్గురు సిబ్బందికి మెమోలు జారీ చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.అలాగే సిబ్బంది సమయానికి విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని, ప్రతి పని బాధ్యతతో, సమయానికి నిర్వహించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.అరుణ్ కుమార్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి మహోత్సవ వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ

- ఆలయ కమిటీ చైర్మన్ తహసిల్దార్ భాస్కర అప్పారావు.
- సుజనకోట పంచాయతీ సర్పంచ్ వి రమేష్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 13.**మండలంలో గల సుజనకోట పంచాయతీ కేంద్ర గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ గంగమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాల వాల్ పోస్టర్స్ ను ఆలయ కమిటీ చైర్మన్ ముంచంగిపుట్టు మండల తహసిల్దార్ భాస్కర అప్పారావు, సుజనకోట పంచాయతీ సర్పంచ్ వెంగడ రమేష్ లు శుక్రవారం ఆవిష్కరణ చేశారు. ఈ నెల 16, 17తేదీన జరిగే గంగమ్మతల్లి పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పండగ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. జాతర మహోత్సవ సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని క్రమ పద్ధతిలో పూజా కార్యక్రమాలు ఏర్పాటుకు ఉత్సవ కమిటీ చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై గోదాము ఇన్చార్జి వెంగడ రవికుమార్, నానిబాబు, వి జగన్, బి బి దామోదరం, కె దామోదరం, ఆలయ పూజారి, కమిటి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోటీపడి నిర్మించారు నిర్లక్ష్యంగా వదిలేశారు







**పోయేది ప్రజల సొమ్మే కదా !**

**పాలకులకు అది ఒక లెక్క !**

**వార్డుల వారీగా చేపల మార్కెట్ షెడ్లను నిర్మించాలి**

**13 వ వార్డు లో నిరుపయోగంగామార్కెట్ షెడ్లు-లక్షల ప్రజాధనం వృధా**

**ఆలోచన లేని అధికారులు**

**క్రొత్త నిర్మాణాలకు ఆమోదం**


**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఫిబ్రవరి 13**:తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ 13వ వార్డు జై భీమ్ నగర్ లో 2018 లో జీవీఎంసీ ప్రత్యేక నిధులతో నిర్మించిన మార్కెట్ సముదాయం ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారి ఆకతాయులకు మందుబాబులకు అడ్డాగా మారింది.టిడిపి ప్రభుత్వంలో నిర్మించిన మార్కెట్ సముదాయం కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ వాటిపై శ్రద్ధచూపించకపోవడం ప్రజల నుండి విమర్శలు ఎదురవుతున్నాయి.లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన మార్కెట్ సముదాయం సమీప ప్రాంత వీధి వర్తకులకు,చేపల బజారుకు,వారపు సంత కు కేటాయించినట్లయితే బాగుండేదని,64 లక్షల రూపాయలతో క్రొత్తగా పెద్దగదిలి రైతు బజార్ వద్ద నిర్మించి తలపెట్టిన చేపల బజార్ పై ప్రజాభిప్రాయం సేకరించి నిర్మించినట్లయితే బాగుండేదని ప్రజల అభిప్రాయపడుతున్నారు. రైతు బజార్ వద్ద నిర్మించిన తలపెట్టిన చేపల బజార్ వేరే ప్రాంతంలో లేదా ఆరిలోవ జై భీమ్ నగర్ వద్ద నిర్మించి ఉన్న మార్కెట్ షెడ్లను ఉపయోగించి న్నట్లయితే బాగుండేదని,దానివలన ప్రజాధనం వృధా కాకుండా ఉండేదని ప్రజల అభిప్రాయపడుతున్నారు. ప్రజల అవసరాల మేరకు పెద్దగదిలి రైతు బజార్ ఇంకా అభివృద్ధి చెందవలసి ఉండగా అదే ప్రాంతంలో చేపల బజారు కేటాయించడం విమర్శలకు దారితీస్తున్నాయి. ప్రజా అవసరాల దృష్టిలో పెట్టుకుని రైతుబజారులను అవసరాలు మేరకు విస్తరింపజేయాలని, రైతులకు కూరగాయలు ఇతర అవసరాల నిమిత్తం శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని, రైతులు వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు. ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ కోచింగ్ సెంటర్ సమీపంలో ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకుని చేపల బజార్ అక్కడి నుండి తొలగించి వార్డుల వారీగా ఖాళీ ప్రదేశాలలో చేపల విక్రయదారులకు షెడ్లు నిర్మించాలని,రైతుబజార్ వెనక ఉన్న అవసరమైన భూమిని అధికారులతో ప్రజాప్రతినిధులు మాట్లాడి ప్రజల అవసరాలు మేరకు చేపల బజార్లు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు చేపల బజారు విషయంలో పునర్ ఆలోచించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మహాశివరాత్రి కి ముస్తాబైన శివాలయాలు...!




**కొయ్యూరు పెన్ పవర్ ఫిబ్రవరి 13:** మండలంలోని మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు. కొయ్యూరు శ్రీ భ్రమరాంబిక సమేతమల్లికార్జున స్వామి, ఎం మాకవరం నాగలింగేశ్వర స్వామి ఆలయం, గాదిగుమ్మి గిరిజ సమేత బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం, పెదమాకవరం శివాలయలు మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. కొయ్యూరు లో వెలిసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయం పురాతనం కావడంతో వేలాది మంది భక్తులు ప్రతి సంవత్సరం వచ్చి అభిషేకాలు దర్శనాలు చేసుకుంటారు. శివరాత్రి జాగరణ అనంతరం మరుసటి రోజు భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటారు. మహాశివరాత్రి రోజు వేకువ జాము నుంచే అభిషేకాలు దర్శనాలు అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నసంతర్పణ ప్రసాద వితరణ కార్యక్రమాలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు కొయ్యూరు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. అలాగే మూడు రోజులపాటు భజనలు కోలాట కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మహాశివరాత్రి సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

# తెలుగును అత్యంత ఇష్టమైన సబ్జెక్టుగా విద్యార్థులు చెప్పాలి





- పిల్లల మనసు గెలవడమే ఉపాధ్యాయుల అంతిమ లక్ష్యం
- తెలుగు భాషా పండితులకు జిల్లా కలెక్టర్ మార్గదర్శకం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. ఫిబ్రవరి 13 :** నేటి యాంత్రిక జీవనంలో విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం చేయకుండా, వారిలో తెలుగు సాహిత్యం పట్ల అభిలాషను, సృజనాత్మకతను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. తరగతి గదిలో విద్యార్థులు గంటసేపు మైమరిచిపోయేలా, వినసొంపుగా పాఠాలు చెప్పడం అలవర్చుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రసాస్వాదనే మన లక్ష్యంగా తెలుగు పరిమళాలు మన చుట్టూ వెదజల్లాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్థానిక మన్యం కళావేదికలో జిల్లా స్థాయి తెలుగు వర్క్ షాప్ కార్యక్రమం విద్యా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని తెలుగు భాషా పండితులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయడమే లక్ష్యంగా కాకుండా, వారి మనసులను ఆకట్టుకునేలా బోధించడమే నిజమైన విద్యా బోధన అని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. పాఠ్యపుస్తకాల్లో ఉన్న ఉదాహరణలకే పరిమితం కాకుండా, సమాజం నుంచి కొత్త కోణాలను సేకరించి విద్యార్థులకు బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు స్వయంగా సాహిత్య అధ్యయనం చేసి విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. తెలుగు భాషా పండితులు అందరూ ఇకపై కచ్చితంగా కథలు రాయాలని ఆదేశించారు.

తెలుగును అత్యంత ఇష్టమైన సబ్జెక్టుగా విద్యార్థులు చెప్పాలని, కథలు, పాటలు రూపంలో తెలుగులో ఉన్న మాధుర్యాన్ని, సౌందర్యాన్ని విద్యార్థులు ఆస్వాదించేలా చేయాలని మార్గదర్శకం చేశారు. భాష యొక్క దిశను మార్చగలిగేది కేవలం ఉపాధ్యాయులేనని, అలాగే అత్యంత సంతృప్తిని ఇచ్చేది ఉపాధ్యాయ వృత్తేనని కలెక్టర్ గుర్తుచేశారు. విద్యార్థుల్లో ఉన్న దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలో పాటలు పాడుతూ, అంత్యాక్షరి వంటి ఆటల ద్వారా సాహిత్యాన్ని నేర్చుకోవాలని కోరారు. ప్రతి శుక్రవారం పాఠశాల గదులను శుభ్రం చేసుకుని, తాము గీసిన బొమ్మలను ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థుల కోసం 'రీడర్స్ క్లబ్' ఏర్పాటు చేయాలని, ప్రతి గురువారం విద్యార్థులు ఒక కవిత లేదా కథను రాసి ఉపాధ్యాయులకు అందించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ నిర్ణయించారు. ఉపాధ్యాయులు మరియు విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు జిల్లా స్థాయి నుండి ఒక 'ఈ-మ్యాగజైన్'ను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు.ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాసే కథలు, కవితలను ప్రచురిస్తారని చెప్పారు. ఉపాధ్యాయులు రాగయుక్తంగా పాడిన పాటలను ప్రోత్సహించడానికి ఒక ప్రత్యేక యూట్యూబ్ ఛానల్‌ను ఏర్పాటు చేస్తామని, తద్వారా మన మన్యం ప్రాంత కళాకారుల ప్రతిభను రాష్ట్రవ్యాప్తంగా చాటవచ్చని తెలిపారు.ఉపాధ్యాయులు సొంతంగా భావాలను విశ్లేషించి, కొత్త గేయాలను, బాణీలను కట్టే స్థాయికి ఎదగాలని కోరారు. ఉపాధ్యాయుడు తన వృత్తికి న్యాయం చేయాలంటే నిరంతర పాఠకుడు కావాలని, పిల్లలతో కలిసి కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.విజయ భాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, వక్తలు గంటేడ గౌరునాయుడు, పక్కి రవీంద్ర, మల్లిపురం జగదీశ్, బౌరోతు శంకరరావు, తెలుగు భాషా పండితులు తదితరులు పాల్గొన్నారు.

## అసలు సభని వదిలేసి కోసరు సభలో గోలెందుకు జగన్!!. ..భీశెట్టి బాబ్జీ



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. ఫిబ్రవరి 13 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న కీలకమైన ప్రజాసమస్యలపై గళం విప్పి ప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావలసిన సమయంలో రాష్ట్ర శాసనసభకు హాజరు కాకుండా శాసన మండలిలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పార్టీ ఎమ్మెల్సీలకు ఆదేశాలు ఇవ్వడం విచిత్రంగా ఉందని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అసలు సభని వదిలేసి కోసరు సభలో గోల చేస్తే ఫలితాలు ఉండవనే విషయం జగన్మోహన్ రెడ్డికి తెలియదా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రాల్లో అసెంబ్లీ సమావేశాలు, జాతీయ స్థాయిలో పార్లమెంట్ సమావేశాల పైనే ప్రజల దృష్టి ఉంటుందని, మండలిలో సంఖ్యా బలం ఉంది కాబట్టి గట్టిగా గొంతు విప్పండి అని చెపుతున్న జగన్, శాసనసభలో తగిన బలం లేదని ఒప్పుకున్నట్టే కదా, అటువంటప్పుడు ప్రతిపక్ష హోదా అంశంపై ఎందుకు రాద్ధాంతం చేసి అదే సాకుతో సభకి వెళ్లకుండా సమయాన్ని వృథా చేస్తున్నారని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డికి ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల పూర్తిస్థాయిలో చిత్త శుద్ది ఉంటే కూటమి ప్రభుత్వంలో పరిపాలన స్కాంల మాయం అనుకుంటే తన పార్టీ నుండి గెలిచి 11 మంది ఎమ్మెల్యేలతో శాసనసభ సమావేశాల్లో పాల్గొని ప్రజల తరపున మాట్లాడాలని, రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో జరుగుతున్న పరిణామాలను ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు నిత్యం పరిశీలిస్తారని అసెంబ్లీ సమావేశాల విషయంలో జగన్మోహన్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. సభ బయట ఉండి మాట్లాడితే అసెంబ్లీకి ఎన్నికయిన వారికీ ఎన్నిక కానివారికీ తేడా ఏమి ఉంటుందని, జగన్మోహనరెడ్డికి రాజకీయ భవిష్యత్తు కావాలంటే రాష్ట్ర శాసనసభలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో లోక్ సత్తా నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం, నగర అధ్యక్షుడు తాత్రాజు రాజారావు, సీనియర్ నాయకులు పతివాడ చంద్రరావు, బోర రమేష్ జిల్లా పౌర వేదిక వర్కింగ్ అధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, ఉపాధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహన్ రావులు పాల్గొన్నారు.

## వందరోజుల పని దినాలు పెరగాలి

- వాట్సాప్ సేవలపై అవగాహన పెంచాలి
- మహాశివరాత్రి సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చెయ్యాలి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. ఫిబ్రవరి 13:**
ఉపాధి వేతనదారులకు 100 రోజుల పనిదినాలు ప్రతి కుటుంబానికి కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. 100 రోజుల పని కల్పనతో పాటు వేతనాలు కూడా అధికంగా అందేలా చూడాలన్నారు. శుక్రవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో ఉపాధి పనులు, ఓ.డి.ఎఫ్, వాట్సాప్ సేవలు, మహాశివరాత్రి ఏర్పాట్లపై టెలీ కాన్ఫిరెన్స్ ద్వారా సమీక్షించారు.

మార్చి లోపల ఉపాధి లక్ష్యాలను చేరుకోవాలని, బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఓ.డి.ఎఫ్ , ఓ.డి.ఎఫ్ ప్లస్ పనులను వేగవంతం చేయాలన్నారు. వాట్సాప్ సేవలు పెరగాలని, ఈ సర్వీసెస్ పై అవగాహన కలిగించాలని , ముఖ్యంగా తహశీల్దార్లు ముందుగా అవగాహన చేసుకొని, రెవిన్యూ సేవలను వాట్సాప్ ద్వారా అందించడానికి కృషి చేయాలని తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో 10 దేవాలయాల వరకు ఎక్కువగా భక్తులు దర్శనాలకు వచ్చే అవకాశం ఉందని, ఆ దేవాలయాల్లో ఏర్పాట్లను పక్కాగా చేయాలని అన్నారు. తహశీల్దార్లు, పోలీస్, దేవాదాయ శాఖ వారు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో సి.పి.ఓ సత్యనారాయణ, డి.పి.ఓ మల్లిఖార్జున రావు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్ .ఈ కవిత, డ్వామా పి.డి శారదా దేవి, డి.ఎల్.డి.ఓ లు, ఎం.పి.డి.ఓ లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో ప్రజల ఫిర్యాదులు స్వీకరణ...!

కొయ్యూరు తహశీల్దార్ మురళి బాబు వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 13:** అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులతో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తహశీల్దార్ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు తహశీల్దార్ మురళి బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... మండలంలోని ఉన్న 33 పంచాయితీల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించడానికి ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులతో ఫిర్యాదులు స్వీకరిస్తామని ఆయన తెలిపారు. అలాగే మండలంలో రెండో విడత భూముల రీ సర్వే త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మొదట విడత సర్వే పనులు దాదాపు పూర్తి అయ్యాయని రెండో విడతలో ఏటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వేకు సంబంధించి ఇప్పటికే పంచాయతీల వారీగా సమీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రీ సర్వేలో భాగంగా ఎం భీమవరం పంచాయతీ పి ఎల్ కొత్తూరు,పుట్టకోటలో మార్చి,ఏప్రిల్ నెలలో 19 మంది లబ్ధిదారులకు పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. 33 పంచాయితీ పరిధిలో ఉన్న 146 గ్రామాలకు అందుతున్న నిత్యావసర సరుకులు పై ప్రతినెల సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొయ్యూరు మండలం ఎం. ఎల్ ఎస్ పాయింట్ ప్రస్తుతం అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణ దేవి పేటలో ఉన్నందున మారుమూల ప్రాంతాలకు సరుకులు సక్రమంగా చేరటం లేదన్నారు అందుకై మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్ ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.

## చెత్త రహిత పాలనకు ప్రజలు అందరూ సహకారం అందించాలి



- మన రాష్ట్రాన్ని మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలి
- నాగలక్ష్మి, డైరెక్టర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్

**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 13:**చెత్త రహిత పాలనకు ప్రజలు అందరూ సహకారం అందించాలి అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి. శుక్రవారం ఉదయం మద్దిలపాలెం లో శ్రీ భావన విద్యా నికేతన్ కరస్పాండెంట్ శ్యామ్ కుమార్ అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, ఎస్ ఆర్ యు – జి విఎంసి లో నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర కార్పొరేషన్ లో "చెత్త రహిత పరిపాలన" (జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన దేశానికి ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చి దిద్దాలని కోరారు. విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరుతూ అవగాహన కల్పించారు. మేధావులు సహకారం అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంద కార్పొరేషన్ విశాఖపట్నం జిల్లా ఐసిసి కోఆర్డినేటర్ శృతి శ్రీ మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు, నగరవాసులు అందరూ చెత్త రహిత నగరంగా విశాఖ మహానగరాన్ని తీర్చి దిద్దడానికి కంకణబద్ధులై జీవించాలని కోరారు. మన అందమైన నగరాన్ని ఒక సుందరమైన విధంగా తీర్చి దిద్దాలని కోరారు. వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారు చేసి ఎవరి ఇంటి వద్ద వారె కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం అవసరం అని వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి,

## మహాశివరాత్రి వేడుకల్లో సేవా సందేశం







**డాబా గార్డెన్స్, పెన్ పవర్ ఫిబ్రవరి 13:**డాబా గార్డెన్స్‌లోని వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రెస్ క్లబ్‌లో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరిలోనూ పరమాత్మను చూడగలిగితే వారు ధన్యులవుతారని అన్నారు. మనుషులు చేసే పనుల ఆధారంగా ఫలితాలు లభిస్తాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ సత్కార్యాలు చేయాలని సూచించారు. ఇతరులకు సహాయం చేసే వారికి పరమశివుని ఆశీస్సులు లభిస్తాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా శివాలయాలు ఉండటం అదృష్టకరమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహాశివరాత్రిని ఘనంగా జరుపుకుంటారని, పరమేశ్వరుని ఆశీస్సులు సర్వ మానవాళిపై ఉండాలని ఆకాంక్షించారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న భారతీయ జనతా పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్. పరశురామరాజు మాట్లాడుతూ హిందూ సమాజంలో సమానత్వం అవసరమని అన్నారు. మహాశివరాత్రిని ఆనందంగా జరుపుకోవాలని, సేవా కార్యక్రమాల ద్వారా జీవితం సార్థకమవుతుందని పేర్కొన్నారు.

జనసేన పార్టీ నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ పరమశివుని ఆశీస్సులతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. త్వరలో దక్షిణ నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివాహాలకు సంబంధించిన ఖర్చులను భరిస్తానని వెల్లడించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ మహాశివరాత్రి ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ అని పేర్కొన్నారు. జర్నలిస్టులను ఈ పర్వదిన వేడుకల్లో భాగస్వాములను చేయడం ఆనందకరమని తెలిపారు.

ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరీ మాట్లాడుతూ ప్రపంచం ఆత్మశక్తితో నడుస్తుందని పేర్కొన్నారు. మహాశివరాత్రి రాత్రి లింగోద్భవ సమయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, ప్రతి ఒక్కరూ పరస్పర సహనం, దయ, ప్రేమ, కరుణతో జీవించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా రూపొందించిన పరమశివుడిపై ప్రత్యేక గీతాన్ని నగర పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. అనంతరం అతిథులకు ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఈ నెల 17న సాయిబాబా వార్షికోత్సవ వేడుకలు



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 13:** ఈ నెల 17 మంగళవారం సింగవరం శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో 21వ వార్షికోత్సవ వేడుకలకు ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 5:15 నిమిషాలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే పూజా కార్యక్రమాలు సాయినాధుడికి చందనాభిషేకం, పాలాభిషేకం, అష్టోత్తర శతనామ పూజ, గాయత్రి హోమం, లక్ష్మీ గణపతి హోమం, పూర్ణ హుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ నిర్వహించినట్లు, కావున భక్తులు వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందిగా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## మహాశివరాత్రి సందర్భంగా ఆర్కే బీచ్‌లో 41వ మహా కుంభాభిషేకం





**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 13 :**కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి. సుబ్బరామి రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 15న ఆదివారం విశాఖపట్నం ఆర్కే బీచ్ సాగర తీరాన 41వ మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఉత్సవ కన్వీనర్, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ తెలిపారు. శుక్రవారం టిఎస్ఆర్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

విశాఖపట్నం ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కలగాలనే సంకల్పంతో సుమారు నలభై సంవత్సరాల క్రితం ఈ మహా కుంభాభిషేకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి ఏటా మహాశివరాత్రి సందర్భంగా అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, అదే ఆనవాయితీతో ఈ ఏడాది కూడా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.

జనసేన పార్టీ నాయకుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ సాగర తీరంలో పండుగ వాతావరణాన్ని తలపించేలా మహాశివరాత్రి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాకినాడ భారత యజ్ఞపీఠం ప్రతినిధి రత్నాల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు కుటుంబ పరంపరగా శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

మహా కుంభాభిషేకం సందర్భంగా భక్తులు పవిత్ర జలాలు, పండ్ల రసాలతో శివలింగానికి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రుద్రాక్షలు, పసుపు తాళ్లు, ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మహా కుంభాభిషేకం, అనంతరం హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఆధ్యాత్మిక సభ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి నగర ప్రముఖులు, శివభక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

కార్యక్రమంలో పలు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.


# ఏనుగుల సంరక్షణ కేంద్రం పనులు వేగవంతం కావాలి. ..






జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. ఫిబ్రవరి 13 :** పార్వతీపురం రేంజ్, గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్‌లో సుమారు 3 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "తాత్కాలిక ఏనుగుల సంరక్షణ కేంద్రం" పనులను జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏనుగులు జనవాసాల్లోకి రాకుండా నిరోధించేందుకు అత్యాధునికమైన ఏనుగు నిరోధక కందకాలు, సోలార్ హ్యాంగింగ్ ఫెన్సింగ్, పట్టుబడిన ఏనుగుల కోసం ప్రత్యేకంగా ఎలిఫెంట్ షెడ్లు, క్రాళ్లు, వాటర్ టబ్‌లు, స్నానపు కొలనుల నిర్మాణ పనులను పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. గుచ్చిమి బీట్‌లోని కంపార్ట్‌మెంట్ నంబర్ 195 మరియు 196 పరిధిలో సుమారు 50 హెక్టార్ల విస్తీర్ణంలో దీన్ని నిర్మిస్తున్నట్లు డీఎఫ్ఓ కలెక్టరుకు వివరించారు. మావటిల కోసం ప్రత్యేక క్వార్టర్లు, కిచెన్ షెడ్ మరియు ఏనుగుల ఆరోగ్య సంరక్షణ కోసం అత్యాధునిక వెటర్నరీ కేర్ సెంటర్ (వైద్య కేంద్రం) ఇక్కడ అందుబాటులోకి రానుందన్నారు. అటవీ ప్రాంతం లోపలికి సులభంగా చేరుకోవడానికి పక్కా అప్రోచ్ రోడ్లను సిద్ధం చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఒడిశా సరిహద్దుల నుండి వస్తున్న ఏనుగుల వల్ల జరుగుతున్న ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందని కలక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. గత పదేళ్లలో మానవ-వన్యప్రాణి సంఘర్షణల వల్ల 14 మంది ప్రాణాలు కోల్పోవడం, 9 ఏనుగులు మృతి చెందడం బాధాకరం అన్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే, సమస్య కలిగించే ఏనుగులను తాత్కాలికంగా ఇక్కడ ఉంచి, ఆపై సురక్షిత ప్రాంతాలకు తరలించడం సాధ్యమవుతుందని తెలిపారు. నాణ్యతతో కూడిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అటవీ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి, జిల్లా అటవీ శాఖ అధికారి జి.ఏ.పి.ప్రసూన, అటవీ క్షేత్ర అధికారులు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## విశాఖలో ఎంపీ భారత్, ఏం ఎల్ ఏ వెలగపూడి అక్రమాలకు ప్రభుత్వం మద్దతు : ప్రియాంక దండి



**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 13 :** విశాఖలో భూముల విలువ పెరగడంతో విశాఖ ఎంపీ భారత్, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబు ఆగడాలు పెరిగిపోయాయని వారికి జిల్లాలో కొంతమంది పోలీస్ ఉన్నతధికారులు మద్దతు పలుకుతున్నారని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో గీతం యూనివర్సిటీ ప్రభుత్వ భూమిని కబ్జా చేసిందని గుర్తించి అధికారులు ఆ భూమిని వెనక్కి తీసుకుంటే విశాఖ నగర కార్పొరేషన్ లో అధికార మార్పిడి జరగగానే ఆ విలువైన భూమిని కౌన్సిల్ సహాయంతో అధికారికంగా ఎంపీ కొట్టేయాలని చూస్తున్నారని,అలాగే వెలగపూడి పై అనేక భూ దందా ఆరోపణలు ఉన్నాయని వారి అక్రమాలు అడ్డుకునే అధికారులంటే వారి ఆటలు సాగవని అలాంటి వారిని బదిలీ చేయిస్తున్నారని మంచి అధికారిగా పేరు తెచ్చుకున్న శ్రీకాకుళం డిఎస్పీ వివేకానంద విశాఖ నగరంలో అత్యంత కీలకమైన హార్బర్ ఏసీపీగా బదిలీ అయిన 24 గంటలలోనే తిరిగి శ్రీకాకుళం బదిలీ అవడానికి వెలగపూడి ప్రభుత్వంలో చక్రం తిప్పాడని ఆరోపణలు విపిస్తున్నాయి. తమ భూ దందాలకు ఎవరు అడ్డు రాకూడదని తమ చెప్పు చేతల్లో ఉండే పోలీస్ అధికారులను వేయించుకుంటున్నారని, వీళ్లు చేసే భూ దందాలలో ప్రభుత్వ పెద్దలకు కూడ వాటాలు ఉన్నాయని అనుమానం కలుగుతోందని,అంతే కాకుండ కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో డ్రగ్స్ కల్చర్ పెరిగిందని అందులో కూటమి నాయకుల సహకారం ఉందని హార్బర్ ఏసీపీగా వివేకానంద అడ్డు పడతాడని వెంటనే బదిలీ చేయించారని ఎంపీ భారత్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబు పాపం పండిందని విశాఖ ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్తారని, ప్రభుత్వం మారితే వీరి అక్రమాల పై పూర్తి విచారణ కోరతానని ప్రియాంక అన్నారు.

# వైసీపీ అనేది ఒక పెద్ద డ్రామా కంపెనీ



- బాబాయ్ హత్య దగ్గర నుంచి ఆ పార్టీ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు
- ఇప్పుడు కల్తీ నెయ్యిపైనా అదే దారి
- నెయ్యి కల్తీ నిజమేనని సిట్ చెప్పినా... సుబ్బారెడ్డి ఒప్పుకున్నా రోడ్డెక్కి నాటకాలు
- తప్పు చేయడం తరువాత బుకాయించడం వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య
- వైసీపీ నాయకులకు ప్రతిపక్ష హోదా తప్ప ప్రజా సమస్యలు పట్టవు
- అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని వైసీపీ ఓట్లు వేసిన ప్రజలు నిలదీయాలి

**విశాఖ దక్షిణంపెన్ పవర్ ఫిబ్రవరి 13 :**'వైసీపీ నాయకులు గత ఏడాదిన్నరగా ప్రధాన ప్రతిపక్ష హోదా గురించే తప్ప... ప్రజలకు అవసరమైన ఉద్యోగ, ఉపాధి కల్పన, పోలవరం నిర్మాణం, రాజధాని అమరావతి పనులపై ఒక్క మాట అంటే ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ప్రజా సమస్యలపై శాసనసభలో చర్చించే అవకాశాన్ని వదులుకొని... రోడ్ల మీద రప్పా.. రప్పా.. డైలాగ్స్ తో కాలం వెల్లదీస్తున్నార'ని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, విశాఖ దక్షిణ శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరు అసెంబ్లీకి ఎందుకు వెళ్లడం లేదని నడిరోడ్డు మీద నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో మాట్లాడారు.

ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ... "కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసమే పని చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్ర. పవన్ కల్యాణ్ ఏ దశలోనూ రాజీపడకుండా పాలన వ్యవస్థను పరుగులుపెట్టిస్తున్నారు.పవన్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పంచాయతీరాజ్ శాఖలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ వేగంగా సాగుతోంది. సాస్కీ నిధులు రూ.2123 కోట్లు పంచాయతీలకు కేటాయించి రహదారులు అభివృద్ధి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారులు అడుగుకో గుంత, గజానికో గొయ్యితో రోడ్లన్నీ అధ్వానంగా ఉండేవి. ఇప్పుడు వేల కోట్లు ఖర్చు చేసి మరమ్మతులు చేస్తున్నాము. నా సొంత నియోజకవర్గమైన తాడేపల్లిగూడెంలోనే దాదాపు రూ.240 కోట్లకు పైగా కేంద్రం నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వ హయాంలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం రెండు కళ్ళగా వేగంగా ముందుకు సాగుతూ ఉంటే జగన్ రెడ్డికి కడుపు మంటగా ఉంది. గత ఐదేళ్లు సంక్షేమం పేరిట అందినకాడికి దోచుకున్నారు. చివరకు కాసులకు కక్కుర్తి పడి శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేశారు.

లి కల్తీ నెయ్యి వినియోగించామని సుబ్బారెడ్డే ఒప్పుకొన్నారు

తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ధృవీకరించినా .. వైసీపీ నాయకులు డ్రామాలు మాత్రం ఆగడం లేదు. లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో రసాయనాలు కలిపారని సిట్ తన నివేదికలో చెప్పినా.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని రోడ్లు ఎక్కుతున్నారు. నెయ్యిలో కల్తీ జరిగిందని సుబ్బారెడ్డే ఒకవైపు ఒప్పుకుంటే... తప్పును ఏదో రకంగా బుకాయించాలని రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. సొంత బాబాయ్ వివేకానందారెడ్డి హత్య దగ్గర నుంచి ఆ పార్టీ నాయకుల డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారు.

లి జల్ జీవన్ మిషన్ పథకానికి జీవం పోశారు

గత వైసీపీ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకాన్ని నీరుగార్చింది. కేంద్ర ప్రభుత్వ నిధులను పనులు చేయకుండా మురగపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్రంతో పవన్ కల్యాణ్ , చంద్రబాబు నాయుడు చర్చించి జల్ జీవన్ మిషన్ కు జీవం పోశారు. రైతులకు ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటోంది. ధాన్యం కొలుగోలు చేసిన 24 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. కష్టాల్లో ఉన్న కోకో, మామిడి, ఉల్లి రైతులకు మద్దతు ధర ప్రకటించి ఆదుకున్నాం. గిరిపుత్రులకు డోలీ మోతలు లేకుండా ఉండాలని అడవి తల్లి బాట కార్యక్రమం కింద మారుమూల గిరిజన గ్రామాల్లో రోడ్లు వేస్తున్నాం. పోలవరం పరుగులు పెట్టిస్తున్నాం. అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాట పట్టింది. చెప్పిన మాట ప్రకారం సామాజిక పెన్షన్ ఒకే సారి వెయ్యి పెంచి రూ.4 వేలు అందిస్తున్నాం. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది' అన్నారు.

లి మిమ్మల్ని గెలిపించింది దేనికి? : వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్

విశాఖపట్నం దక్షణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... 'జగన్ అసెంబ్లీకి రారు... తన క్రికెట్ టీం 10 మంది ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకొంటున్నారు. వైసీపీని గెలిపించిన 11 నియోజకవర్గాల ఓటర్లకీ అప్పీల్ చేస్తున్నాము.. అసెంబ్లీకి ఎందుకు వెళ్ళడం లేదు అని మీ ఎమ్మెల్యేలను నడిరోడ్డు మీద నిలదీయండి. మిమ్మల్ని గెలిపించింది తాడేపల్లిలో మీటింగ్ కి వెళ్లడానికి కాదు... అసెంబ్లీకి వెళ్ళి మా సమస్యలపై మాట్లాడటానికి అని దులిపేయండి. అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకొంటున్నారు, ప్రభుత్వం ఇచ్చే సెక్యూరిటీ వాడుకొంటున్నారు. అసెంబ్లీకి రాని వాళ్ళకు ఇవన్నీ ఎందుకు?' అన్నారు.

# ఐలా కమిషనర్ కి పొల్యూషన్ పై ఫిర్యాదు



**కూర్మన్నపాలెం : పెన్ పవర్ ,ఫిబ్రవరి 13** జీవీఎంసీ 87 వార్డు పరిధిలో గల కణితి కాలనీ కళింగ వీధి మరియు తిరుమల నగర్, పాతడ్లపూడి, ఎన్టీఆర్ నగర్ కోలనీలకు ఇండస్ట్రియల్ ఏరియాను అనుకోని ఉండడం వల్ల సౌండ్ పొల్యూషన్ మరియు దుమ్ము ధూళి మరియు గ్యాస్ వ్యర్ధాలు వాటర్ పొల్యూషన్ వల్ల కాలనీ ప్రజలు అనారోగ్యాలు పాలవుతున్నారని అని ఐల ఆఫీసులో వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది కాలనీ ని అనుకున్న గ్యాస్ కంపెనీ అలాగే పేబర్ కేషన్ ఇండస్ట్రీ మరియు ప్లాస్టిక్ తయారీ ఇండస్ట్రీలు మరియు స్టీల్ మెటల్ ఇండస్ట్రీలు వల్ల పొల్యూషన్ సౌండ్ పొల్యూషన్ దుమ్ము దూళి కాలనీ పై పడుతుందని అలాగే రాత్రివేళ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని దానివల్ల వాటర్ పొల్యూషన్ జరుగుతుందని దానివల్ల ప్రజలందరూ చాలా ఇబ్బందులు అనారోగ్య పాలవుతున్నారని ఐల కమిషనర్ వారి కార్యాలయానికి తెలియజేశారు వారు మాట్లాడుతూ తక్షణమే ఆ ఇండస్ట్రీలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు 87 వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు బొడ్డ గోవింద్ , గాజువాక బీసీ సెల్ అధ్యక్షుడు చిత్రాడ వెంకటరమణ,కణితి గ్రామ దేవత కమిటీ చైర్మన్ ప్రకట శ్రీనివాస్ 76 వార్డు పరిశీలకులు ముద్దపు దామోదార్, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి దుగ్గపు దానప్పలు, గ్రామ కమిటీ కార్యదర్శి బడగల రాము తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం పరువుతీసిన వైసీపీ మద్యం కుంభకోణం...!

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 13 :** ఒకటా రెండా మొత్తం వైసీపీ పాలన అంతా కుంభకోణాల మయంగా మారిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు విమర్శించారు.

శుక్రవారం భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. మద్యం కుంభకోణం ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి బెయిల్ పిటీషన్ పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం విచారించి చేసిన వ్యాఖ్యలు వైసీపీ నాయకులకు చెంప పెట్టని అన్నారు. మద్యం స్కామ్ కు రాజ్ కసిరెడ్డే ఆర్కిటెక్ట్ అని బెయిల్ ఇచ్చే ప్రసక్తే లేదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పిన అంశాలను వైసీపీ పెద్దలు గమనించాలని అన్నారు. దీనిని బట్టి మద్యం కుంభకోణం ఏ స్థాయిలో జరిగిందో, ఎవరెవరు ఇందులో భాగస్వాములై ఉన్నారో లెక్కలు తేలుతాయని అన్నారు. మద్యం కుంభకోణం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడమే కాకుండా, రాష్ట్రం పరువుతీశారని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నకిలీమద్యం తయారీకి రూపకల్పన చేసిన ఘరానా మోసగాళ్ళను ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టొద్దని అన్నారు. కల్తీ మద్యం ద్వారా ఎంతోమంది ఆడపడుచుల పుస్తెలతాడులను తెంపడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటలాడారని అన్నారు. మద్యం కుంభకోణం ద్వారా 3,200 కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని, ఈ కేసులో ఏ7 గా ఉన్న ముప్పిడి అవినాష్ కు నీడలా రాజ్ కసిరెడ్డి వ్యవహారించారని ఇంకా లోతైన దర్యాప్తు జరపాలని సుప్రీం చేసిన వ్యాఖ్యలు దేనికి నిదర్శనమని అన్నారు. దేశంలోనే అతి భయంకరమైన, పెద్దదైన కేసుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణమని అన్నారు. ఇంకా నిందితులు ఉన్నారని పూర్తిస్థాయి దర్యాప్తు జరిగితే ఎవరి భాగోతం ఏంటో తెలుస్తుందని అన్నారు. ఎంతటివారినైనా మద్యం కుంభకోణం కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుందని ఇది ప్రతీ ఒక్కరూ గమనించాలని గంటా నూకరాజు అన్నారు.

## సంకాడ పంచాయతీ రోడ్ల మంజూరు కోరుతూ స్పందనలో వినతి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 13:** మండలంలోని సంకాడ పంచాయతీ పరిధిలో వసువాడ నుంచి మేట్ట వీధి మీదుగా బచ్చలకొండి వరకు, అలాగే సంకాడ కొత్తూరు నుంచి గోవాడ వరకు రోడ్లు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షుడు ఊలం ఈశ్వరరావు అసిస్టెంట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకాడ పంచాయతీలో పారాసైటిక్ వ్యాధులతో బాధపడుతున్నవారు మరియు మానసిక ఒత్తిడికి గురైన వ్యక్తులకు సంబంధిత వైద్య ధ్రువపత్రాలు జారీ చేసి ప్రభుత్వం నుంచి పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలు, ఆరోగ్య సంబంధిత ఇబ్బందులను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్యలపై అసిస్టెంట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, దీనికి ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఊలం ఈశ్వరరావు తెలిపారు.

## 87వ వార్డ్ లో శిథిలావస్థకు చేరిన సిసి రోడ్డు పునర్ నిర్మాణం -పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్



**గాజువాక :పెన్ పవర్ ,ఫిబ్రవరి 13** జీవీయంసి 87వ వార్డు పరిధి మీసేవ గ్రౌండ్ కి ఆనుకొని శిథిలావస్థకు చేరిన సీసీ రోడ్డుకు జీవీఎంసీ నిధులు మంజూరు చేయించి కొత్తగా నిర్మాణం చెప్పా ట్టారు . సీసీ రోడ్డును పరిశీలించుటకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం పరిశీలించారు . రోడ్డు లు నిర్మించి సుమారు 20 సంవత్సరాలు పైబడిందని రోడ్డు శిథిలావస్థకు చేరడం వల్ల ప్రజలు ఈ మార్గాన్ని వినియోగించుకోవడం చాలా కష్టంగా మారిందని వారిని దృష్టిలో పెట్టుకొని రోడ్డు పునర్నిర్మాణం చేయడం జరిగిందని బోండా అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, డివి అప్పారావు, ఆనంద్ కుమార్, వై. భాస్కరరావు,మల్లా రాము, కడుపుట్ల శ్రీను, సుందర్ సునీల్, బొడ్డా సన్యాసి, ఏటీఎన్ మూర్తి, దాలయ్య, మహేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రింతాడ ప్రభుత్వ పాఠశాలకు నూతన ప్రధానోపాధ్యాయుడుగా టి.వి ప్రసాద్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 13:** మండలంలోని రింతాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయులుగా టీ.వీ. ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మన్యం జిల్లా పార్వతీపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జిల్లా పి.ఆర్.టి.యు అధ్యక్షులు యు.వి. గిరి కూడా నూతన ప్రధానోపాధ్యాయులను అభినందించి, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఆకట్టుకున్న విద్యార్థినిల నృత్యాలు.




**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 13 పెన్ పవర్.** మండలంలో గల ఓ ఒకేషనల్ కళాశాల విద్యార్థుల విడ్కోలు కార్యక్రమాన్ని ప్రధాన ఉపాధ్యాయులు దొడ్డి చిన్నంనాయుడు,ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని స్థానిక కళ్యాణ మండపంలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ. విద్యార్థినిలు సాంప్రదాయ వస్త్రధారణతో చేసిన సోలో, గ్రూప్ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. మా కళాశాల విద్యార్థి,విద్యార్థులు చదువుతోపాటు అనేక కార్యక్రమాల్లో ముందంజలో ఉంటారని ఆయన అన్నారు. కళాశాలలో చదువుకున్న సుమారుగా 150 మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పీ.ఎం. జన్మన్ గృహాల బకాయిలు వెంటనే చెల్లించాలి

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 13:** మండలంలోని 16 పంచాయతీలకు చెందిన పీఎం జన్మన్ గ్రామీణ గృహాల లబ్ధిదారులు గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. చైతన్య స్రవంతి నుండి హౌసింగ్ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకుని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సి.పి.ఎం పార్టీ మండల కార్యదర్శి గాలికొండ, ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ పీఎం జన్మన్ గ్రామీణ ఇళ్లకు చెల్లించాల్సిన బకాయిలు ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం సమీపిస్తున్నందున వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సీ.ఎం జగన్ పట్టణ ఇళ్లకు రూ.1 లక్ష, గ్రామీణ ఇళ్లకు రూ.75 వేలు అందజేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతర జిల్లాలకు నిధులు విడుదల చేసినప్పటికీ అల్లూరి జిల్లాకు నిధులు ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. జిల్లాలోని అధికారులు, కూటమి నాయకులు ఈ అంశంపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. తక్షణమే లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 27న 'చలో ఐటీడీఏ' ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అన్ని మండలాల గృహ లబ్ధిదారులు



పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం మండల నాయకులు కోర్ర బాలయ్య, పరమేశ్వరావు, కేశవరావు, కాంగ్రెస్ నాయకులు అల్లంగి రాజు, లబ్ధిదారులు కల్లో బాబురావు, గిన్నెల రమేష్, ఎస్. కరయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ముగిసిన వార్షిక జిల్లా పోలీసు స్పోర్ట్స్ డ గేమ్స్ మీట్--2025.





- క్రీడల్లో ఓటమి విజయానికి తొలిమెట్టు
- క్రీడలతోనే మానసిక ఉత్సాహం
- ప్రతీ ఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి.
- క్రీడల ద్వారా ఐకమత్యం, సమన్వయం.
- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి 13:** క్రీడల్లో ఓటమి విజయానికి తొలిమెట్టు అని, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, టీమ్ స్పిరిట్ పెంపొందుతాయని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి ఐపిఎస్ పేర్కొన్నారు. తండేవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్ర మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించిన "జిల్లా పోలీసు స్పోర్ట్స్ డ గేమ్స్ మీట్--2025" శుక్రవారం అంగరంగ వైభవంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి రేంజ్ ఐజీ ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా 400 మీటర్ల రిలే, 100 మీటర్ల పరుగుపందెం, టగ్ ఆఫ్ వార్ ఫైనల్ మ్యాచ్‌లను ప్రారంభించి ఆసక్తిగా వీక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ క్రీడా పోటీలలో శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్‌డివిజన్లు, ఎస్‌టిఎఫ్, జిల్లా ఆర్మ్ రిజర్వ్, జిల్లా పోలీసు కార్యాలయం, హోంగార్డు ఏడు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా క్రీడాకారులు మార్చ్ పాస్ట్ నిర్వహించి రేంజ్ ఐజీకి గౌరవ వందనం సమర్పించారు.

ఓవరాల్ ఛాంపియన్ గా ఆర్మ్ రిజర్వ్ పోలీసులు నిలిచారు.
వాలీబాల్ ఆర్మ్ రిజర్వ్ జట్టు కైవసం చేసుకోగా
కబడ్డీ కాశీబుగ్గ సబ్ డివిజన్.
బాస్కెట్ బాల్ డీపీవో జట్టు.
క్రికెట్ ఎస్‌టిఎఫ్ జట్టు.
టగ్ ఆఫ్ వార్ ఎస్‌టిఎఫ్
100 మీటర్ల పరుగుపందెం (అధికారులు)డిఎస్పి శేషాద్రి -- ఆర్మ్ రిజర్వ్,
డిఎస్పి షేక్ షహబాజ్ అహ్మద్ -- కాశీబుగ్గ, అదనపు ఎస్పీ కెవి రమణ.
బ్యాడ్మింటన్ మొదటి స్థానం ఎస్సై భరత్ కుమార్ (క్లూస్ టీమ్), ఎస్సై హరికృష్ణ (ఒన్ టౌన్).
ద్వితీయ స్థానం -- అదనపు ఎస్పీ రమణ, యూనిట్ డాక్టర్. విజయ కుమార్.
పై వారితోపాటు పోలీసు అధికారులు,సిబ్బంది వ్యక్తిగత విభాగంలో పలు క్రీడా అంశలలో ప్రతిభ కనబరిచి క్రీడా బహుమతులు గెలుపొందారు.

పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదని,మానసిక--శారీరక దృఢత్వం అత్యవసరమని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి తెలిపారు. క్రీడలు ఆరోగ్యం, ఐక్యత, అంకితభావం, సమన్వయం వంటి విలువలను పెంపొందిస్తాయని చెప్పారు.

క్షేత్రస్థాయిలో ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి పనిచేసే సిబ్బందికి మానసిక, శారీరక దృఢత్వం ఎంతో అవసరమన్నారు. స్పోర్ట్స్‌లో పాల్గొనడం కేవలం మూడు రోజుల ఆరోగ్య ప్రయోజనం కోసం కాకుండా, స్వీయ ఆత్మపరిశీలనకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఆరోగ్యం -- ఐక్యత -- అంకితభావం -- సమన్వయం వంటి విలువలను క్రీడలు పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసే సిబ్బంది ఒకే వేదికపై కలుసుకుని పరస్పర అవగాహన పెంపొందించుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గెలుపు-ఓటములకంటే సమాన భావన, సహకారం, టీమ్ స్పిరిట్ ముఖ్యమని సూచించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిబద్ధత, అంకితభావం బాధ్యతతో, నిరంతరం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి డ డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలు, మహిళలు -- చిన్నారుల భద్రత వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనడానికి టీమ్ స్పిరిట్ అవసరమని, ప్రతి ఒక్కరు అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా ఎస్పీ నాయకత్వంలో జిల్లా పోలీసు శాఖ మంచి ఫలితాలు సాధిస్తున్నదని ప్రశంసించారు. జిల్లా పోలీసు శాఖ తరఫున స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న అందరికీ అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఐక్యంగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జిల్లాలోని అన్ని వింగ్స్, సబ్‌డివిజన్లు సమగ్రంగా పాల్గొనడం ఆనందదాయకమని ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తెలిపారు. కార్యక్రమం మొత్తం ప్రశాంతంగా జరిగి ఎవరికి గాయాలు లేకుండా విజయవంతంగా ముగియడం సంతోషకరమన్నారు. "పాల్గొనడం ముఖ్యము -- గెలుపు ఓటములు సహజము" అని పేర్కొన్నారు. క్రీడలు ఐక్యత, సమన్వయం, పరస్పర అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని, సంవత్సరం పొడవునా క్రీడలను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ స్పోర్ట్స్ మీట్ లో కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, షాట్ పుట్, జావెలిన్ త్రో, స్విమ్మింగ్, అథ్లెటిక్స్, 100 డ 400 మీటర్ల పరుగులు, క్రికెట్,షటిల్ బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, బ్రిక్ వాక్, తదితర క్రీడలలో ప్రతిభ కనబరచిన వారిని అభినందించారు. ఈ 2025 స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు మెమెంటోలు అందజేశారు. ముగింపు సందర్భంగా బాణాసంచా ప్రదర్శన కార్యక్రమాన్ని మరింత వైభవంగా మార్చింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీలు వివేకానంద, షేక్ షహబాజ్ అహ్మద్, శేషాద్రి, సీఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థాపించి 50 సంవత్సరాల అయిన సందర్భంగా

స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి



**పాడేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 13:** పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం అయ్యి ఈ సంవత్సరంతో 50 సంవత్సరాలు అయిన సందర్భంగా కళాశాలలో స్వర్ణోత్సవాలు ఘనంగా జరుపుకోవటం జరిగింది. ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాస్ రావ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ముంచింగిపుట్టు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దొర ,మరియు పాడేరు హై స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్ అవ్వటం జరిగింది.
వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ
విద్యార్థులు దేశానికి వెన్నెముక లాంటి వారిని చెడు వ్యసనాలు బానిస కాకుండా ఉండాలని ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో కాలేజ్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనటం జరిగింది.

## కొత్తపాలెంలో 8 గృహాలకు గ్రౌండింగ్ మేళా




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 13:** అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని లకవరపుపేట పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో 8 గృహాల నిర్మాణానికి సంబంధించి శుక్రవారం గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ ఎం. సత్యనారాయణ, ఉప సర్పంచ్ బి. గంగాధర్, కూటమి నాయకులు ఎస్. రామారావు, కె. గోపాలరావు, కె. వీరభద్రరావు, కె. కోటిపడాల్, జి. నాగేశ్వరరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ పి. లక్ష్మీ విమల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్లు ఎస్. సూరిబాబు, పి. చిట్టిపడాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి. అనిల్, గ్రామ పెద్దలు కె. ఉర్దూబు, వార్డు సభ్యులు వి. గణేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో గృహ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి....

**వల్సంపేట పంచాయతీలో పర్యటించిన మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్.....**

**నాతవరం, పెన్ పవర్ ( ఫిబ్రవరి 13):** నాతవరం మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్ శుక్రవారం మండలంలో గల వల్సంపేట పంచాయతీలో పర్యటించారు. ముందుగా ఎంపీయూపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో సౌకర్యాల గురించి ఆరా తీశారు. క్రమశిక్షణతో ఉండి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంను సక్రమంగా పిల్లలకు పంపిణీ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను పరిశీలించారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె.సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# రికార్డుస్థాయిలో చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి వార్షిక ఆదాయం.






**ఆలమూరు,పెన్ పవర్, ఫిబ్రవరి 13;** చింతలూరు శ్రీనుకాంబికా అమ్మవారి వార్షిక ఉగాది జాతర మహోత్సవాల సందర్భంగా 2026వ సంవత్సరానికి గాను వార పోయుట, తుళ్ళుబిళ్ళ తీయుట తదితర లైసెన్సుకు సంబంధించి శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆరు లైసెన్సుకు గాను ముప్పై రోజులకుగాను రూ.67,41,000ల పాట నమోదైనట్లు ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి, పాలకమండలి ఛైర్మన్ వీరి అప్పారావులు తెలిపారు. గతంలో ఈ లైసెన్స్ హక్కుల పాటలు 6 రోజులకు ఉండేవని, గ్రామస్తుల అభ్యర్ధన మేరకు దేవస్థానం పాలకమండలి తీర్మానం చేయడం, ఆ తీర్మానాన్ని దేవాదాయశాఖకు పంపడం, న్యాయస్థానం లీగల్ సలహాలు తీసుకుని బహిరంగ వేలం పాటలు నిర్వహించినట్లు వారు తెలిపారు. గతంలో కన్నా ఈ యేడాది రూ.53,86,000లు వార్షిక ఆదాయంగా గరిష్టసంఖ్యలో నమోదైందని తెలిపారు. ఈ ఆదాయంతో దేవస్థానంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని, న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రత్యేక అకౌంటు తెరుస్తామని తెలిపారు. వార్షిక జాతర ఉత్సవాలు ఈనెల 19న బుట్టగరగతో ప్రారంభించి వచ్చే నెల 17న జాగరణ,18న తీర్థం, 19న ఉగాదితో పాటు ఏప్రిల్ 15 వరకూ జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. పాలకమండలి సభ్యులు, గ్రామస్తులు, ఆసాదులు, అర్చకుల సహకారంతో ముందుకు వెళతామన్నారు.

**కూటమి హయంలో దేవస్థానం అభివృద్ధి వేగవంతం**

కూటమి అధికారంలోకి వచ్చాక దేవస్థానం అభివృద్ధి వేగవంతం అయిందని దేవస్థానం పాలకమండల్ చైర్మన్ వీరి అప్పారావు తెలిపారు. పాలకమండలి సభ్యులు, కూటమి నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, దాతలు, గ్రామస్తుల సహకారంతో రూ.3కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామ తెలుగుదేశం అధ్యక్షులు వైట్ల గంగరాజు, జనసేన అధ్యక్షులు దేశాబత్తుల సత్యనారాయణ పాలకమండలి చైర్మన్ వీరి అప్పారావు,గన్ని వెంకట్రావు, పూదూరి శ్రీనివాస్,పసుపులేటి వీరబాబు, కాలా సూరిబాబు,చర్ల పుష్పవతి, నందూరి మోహన సుభాష్,మాజీ చైర్మన్లు వైట్ల శేషుబాబు,ద్విభాష్యం విస్సుపందు, దొమ్మేటి రామకృష్ణ, అర్చకులు పెద్దింటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా ఎగుమ తుల ప్రోత్సాహక కమిటీ సమావేశం



- **అరటి, కొబ్బరి ఉత్పత్తుల ఎగుమతులకు కార్యాచరణ**
- **జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**

**అమలాపురం/అంబా, పెన్ పవర్, ఫిబ్రవరి 13:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాల ద్వారా కోనసీమ జిల్లాలోని స్థానిక కొబ్బరి అరటి కోకో ఉత్పత్తులకు జాతీయ, అంతర్జా తీయ మార్కెట్లలో ప్రవేశ పెట్టి ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా ఎగుమ తుల ప్రోత్సాహక కమిటీ 18వ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం సభ్యుల తో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా 17వ సమావేశపు పరిశ్రమల ప్రోత్సాహం, ఎగుమతు ల పెంపు, ఎంఎస్ ఎంఈ అనుమతుల మినిట్స్ పై తీసుకున్న నిర్ణయాలను జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతుల సామర్థ్యాన్ని గుర్తించి, స్థానిక అరటి, కొబ్బరి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతులు చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఎగుమతుల పెంపు కోసంవ్యూహాల రూపకల్పన, ఎగుమతిదారుల సమస్యల పరిష్కారం ఆర్థిక సహాయం అందించడంతో పాటుగా ఒక జిల్లా-ఒక ఉత్పత్తి కార్యక్రమ అమలు పురోగతి పై సమీక్షించారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్. ఎస్ ఎం ఇ /ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లు నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తదుపరి ఆ యొక్క స్థలాలను ఏపీఐఐసీ ద్వారా మౌలిక వసతులు కల్పనకు ప్రతిపాదనలు రూపొందిం చాలన్నారు .ఎం ఎస్ ఎం ఈ పథకం ద్వారా యూనిట్ల స్థాపనకై కొత్త పారిశ్రామిక వేత్తలకు మార్గ దర్శకత్వం వహించాలన్నారు. కొత్త పరిశ్రమల అనుమతులు క్లియరెన్సులు ఏకగవాక్ష విధానంలో త్వరితగతిన ఇవ్వాలని ఆదేశించారు. కొత్తగా స్థాపించబడే యూనిట్ల ప్రతిపాదనల పరిశీలన, భూ కేటాయింపు,విద్యుత్, నీరు, కాలుష్య నియంత్రణ అనుమతుల సమన్వయం చేసుకోవాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి వద్ద పెండింగ్లో ఉన్న రెండు దరఖాస్తులను త్వరగా క్లియర్ చేయాలన్నారు. పరిశ్రమల విస్తరణ ఆధునీకరణ, ఉన్న యూనిట్ల విస్తరణకు ఆర్థిక సాంకేతిక సహాయం అందించాలన్నారు టెక్నాలజీ అప్గ్రేడేషన్ డిజిటలైజేషన్, సబ్సిడీలు, రాయితీలు, ఇండస్ట్రియల్ పార్కులు, ఎగుమతి సామర్థ్యం పెంపుకు చర్యలు .ఒక జిల్లా ఒక ఉత్పత్తి కొబ్బరి ఉత్ప త్తులు, నేచురల్ బనానా ఫైబర్స్, క్వాయర్ ఉత్పత్తులు గుర్తించబ డ్డాయన్నారు .వాల్యూ అడిషన్ శిక్షణలు, మార్కెట్ లింకేజ్లు పారదర్శకంగా రుణాలను మంజూరు చేయాలనన్నా రు. సింగిల్ విండో అను మతుల పురోగతి ఏపిఐఐసి ద్వారా సింగిల్ విండో సిస్టమ్ ఆన్లైన్లో అమ లులో ఉందన్నారు పరిశ్రమల అనుమతులు వేగవంతం కావడానికి డిజిటల్ ప్లాట్ఫామ్లు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి వి రమణ, ఏపీఐఐసీసీ జోనల్ మేనేజర్ రమణా రెడ్డి, ఎమ్ ఎస్ ఎం ఇ డైరెక్టర్ అంబటి భూలక్ష్మి, ఏపీ ఇండస్ట్రియల్ బోర్డు సభ్యులు మట్టపర్తి భారతి ఎల్డీఎం కేశవ వర్మ సిడ్బి ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, కాలుష్యని యంత్రణ మండలి ఈఈ సూర్య కళ, ఏపీ ఈపీ డీసీఎల్ పర్యవేక్షణ ఇంజనీర్ బి రాజేశ్వరి, డిపిఓ శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతినేలా కలెక్టర్ పత్రికా ప్రకటన



**జర్నలిస్టు సంఘాలు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఖండన**

**కాకినాడ, పెన్ పవర్,ఫిబ్రవరి 13...** అక్రిడిటేషన్ కొరకు ఏ సంఘమైన, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులైనా డబ్బులు వసూలు చేసిన, డిమాండ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం ఉన్న కలెక్టర్ జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతినేలా పత్రికా ప్రకటన విడుదల చేయడాన్ని అన్ని జర్నలిస్టు సంఘాల నాయకులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఖండించారు. ఎవరైనా డబ్బులు తీసుకుంటే చట్టపరంగా శిక్షించాలి తప్ప అన్ని సంఘాలకు, అందరు సభ్యులకు ఆ మచ్చ వేయడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. కాకినాడ జిల్లాలోని జర్నలిస్టు సంఘాలైన ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్,జాఫ్, ఏపీజేఎఫ్, ఎపిఎంఎఫ్ సంఘాల అధ్యక్షులు, మీడియా సంఘాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, కలెక్టర్ నామినేట్ చేసిన సభ్యులు, చిన్న, మధ్యతరహా పత్రికల అసోషియేషన్ ప్రతినిధులు, వారి అనుబంధ సంఘాలు, కాకినాడ ప్రెస్ క్లబ్ సభ్యుల జేఏసీ అత్యవసర సమావేశం శుక్రవారం కాకినాడలో నిర్వహించారు. దీనిలో పలు అంశాలపై చర్చ జరిగింది. ప్రధానంగా కాకినాడ జిల్లా కలెక్టర్ ఈనెల 12న ఇచ్చిన ఒక పత్రికా ప్రకటనపై ఏకగ్రీవంగా ఖండిస్తు తీర్మానం చేయడం జరిగింది. జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతినేలా కలెక్టర్ పత్రికా ప్రకటన ఉందని తీర్మానించారు. ఇది పొరపాటున జరిగిందా, ఉద్దేశపూర్వకంగా జరిగిందా అనేది తెలియపరచాలని తీర్మానించారు. ఎవరైతే డబ్బులు డిమాండ్ చేశారో వారిపై విచారణ చేసి కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని, అప్పటివరకూ అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా లు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. ఈ విషయంపై లిఖిత పూర్వకంగా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించాలని తీర్మానించారు. తదుపరి కార్యాచరణపై అన్ని జర్నలిస్టు సంఘాలు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, ప్రెస్ క్లబ్ సభ్యులు మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులైన ఎస్.కె దుర్రానీ, వి.నవీన్ రాజ్, వి.సాయినాథ్, శివన్నారాయణ రెడ్డి, త్రిమూర్తులు, కోనేటి శ్రీనివాస్, ముమ్మిడి లక్ష్మణ్, గునిపే శోభన్ బాబు, అంజి బాబు, కృష్ణంరాజు, పుర్రె త్రినాధ్, దుర్గారావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాజేష్, కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచెరువులు--కిన్నెరబంద రహదారి పనులకు శ్రీకారం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 13:** అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం లక్కవరపుపేట పంచాయతీ పరిధిలో ఎర్రచెరువులు నుంచి కిన్నెరబంద గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం రహదారి మంజూరు చేయడంతో శుక్రవారం పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామపంచాయతీ సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్ కొబ్బరికాయ కొట్టి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామానికి రహదారి సౌకర్యం కలగడం పట్ల కిన్నెరబంద గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యనారాయణ కూటమి నాయకులుతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.ద

## సబ్ డిపోను ప్రారంభించిన మండల పార్టీ అధ్యక్షులు.



**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 13 పెన్ పవర్ :**మండలంలో దుడ్డుఖల్లు పంచాయితీ దొరజం గ్రామంలో సబ్ డిపోను స్థానిక సర్పంచ్ నిమ్మక నీలావతి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు,ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.కూటమి ప్రభుత్వం వచ్చి ప్రజల కష్టాలు తెలుసుకుని ఈ సబ్ డిపోను ఏర్పాటు చేయడం జరిగిందని గతంలో వై.ఎస్.ఆర్.సి.పి ఇంటింటికి రేషన్ బియ్యం సరఫరా అంటు ప్రజలను చాలా మోసం చేశారని.కుటమి ప్రభుత్వంవచ్చి మంచి ఆలోచనతోఈ సబ్ డిపో లను ప్రారంభించిందని ఒక నెలలో ఒకటో తారీక్ నుంచి 15వ తారీకు లోపు ఎప్పుడైనా తీసుకునే వెసులుబాటు ఉందని ఆయన అన్నారు.ఈ సబ్ డిపో నాలుగు గ్రామాలకు ఒక డిపో నియమించడం జరిగిందని స్థానికులకు మండల కన్వీనర్ వివరించారు.ఈ కార్యక్రమంలో డిపో సేల్స్ మెన్.మన్మధరావు,బిజెపి జిల్లా ఎస్టి మోర్చా నిమ్మక సింహాచలం,వీఆర్వో హరికృష్ణ,గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సుకు పోలీస్ సేవలు ఎనలేనివి

**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 13;**సమాజ శ్రేయస్సు కోసం శాంతి భద్రతల పరిరక్షణలో అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల రక్షణకు అంకితభావంతో పనిచేసే పోలీసుల సేవలు ఎనలేనివని మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ, మండల ప్రముఖ నాయకులు, అధికారులు కొనియాడారు. స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ పదోన్నతులు పొంది బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆలమూరు ఎసై నరేష్ అధ్యక్షతన స్థానిక కొత్తూరు ఎస్ జె ఆర్ ఫంక్షన్ హాల్ లో గురువారం రాత్రి అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం అనేది అత్యంత బాధ్యతతో కూడుకున్నదని, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి ఉన్నత స్థానాలకు చేరుకున్న సిబ్బందిని చూసి గర్వంగా ఉందన్నారు. ఆలమూరు పరిధిలో వీరు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎస్సై నరేష్ మాట్లాడుతూ, పదోన్నతి పొందిన వారు తమ కొత్త బాధ్యతల్లో కూడా ఇదే ఉత్సాహంతో పనిచేయాలని ఆకాంక్షించారు. తోటి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ క్లిష్ట సమయాల్లో కూడా మొక్కవోని ధైర్యంతో పనిచేసిన వీరి తీరు శాఖకు గర్వకారణమని ప్రశంసించారు. అలాగే పలువురు రాజకీయ, సామాజిక నాయకులు, సహ ఉద్యోగులు మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ సమాజానికి వెన్నెముక వంటిదని, ప్రజల కోసం తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేస్తూ సేవలందించే పోలీసుల పాత్ర అమోఘమని అభినందించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఏ ఎస్ ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందిన డి. సూర్య చంద్రరావు, ఐడి పార్టీ హెచ్సి నుంచి ఏఎస్ఐ గా పదోన్నతి పొందిన డి.సుబ్రహ్మణ్య స్వామి, బదిలీపై వెళుతున్న హెడ్ కానిస్టేబుళ్ళు సి.హెచ్.వీర్రాజు, బి.నేత్ర, కానిస్టేబుళ్ళు వై.రామకృష్ణ, ఎం.గోపాల కృష్ణ, ఆర్.సుబ్రహ్మణ్యం ఉన్నారు. చివరగా కార్య క్రమానికి విచ్చేసిన ఆహ్వానితులందరూ పుష్ప గుచ్చాలు, జ్ఞాపికలు అందచేసి వారి భవిష్యత్తు మరిన్ని విజయాలతో నిండాలని ఆకాంక్షించారు.

## దేవుడిచ్చిన మానవజీవితాన్ని చేతులారా పాడు చేసుకోవద్దు.



**-జగ్గంపేట ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర.**

**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 13**:ఎన్నో జన్మల పుణ్యఫలం మానవ జీవితం.అటువంటి మానవ జీవితాన్ని చేజేతులారా పాడు చేసుకుని చింతించవద్దని పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు. బూరుగుపూడి గ్రామంలో పాస్టర్ డేవిడ్ అభిషేకం పర్యవేక్షణలో లిటిల్ ఫ్లాక్స్ పెంతుకొస్తు మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ దేవుడు ప్రసాదించిన మన శరీరాన్ని మనం కాపాడుకోవాలని సారా, బ్రాందీ, చుట్ట బీడి ,సిగరెట్ , గంజాయి,పాన్ పరాగ్ ,వ్యభిచారం , సోమరితనం వంటి దుర్వ్యసనాలకు లోనవకుండా ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా, ఆర్థిక అభివృద్ధి చెందుతూ ఆదర్శంగా జీవించాలని పాటంశెట్టి సూర్యచంద్ర ప్రజలను కోరారు. పాస్టర్ అభిషేకం గారి సేవలను అభినందించారు మానవసేవయే మాధవ సేవగా భావించి ప్రతి ఒక్కరూ పరోపకారం దిశగా ఆలోచించాలని కష్టాల్లో ఉన్నవారిని, రోగగ్రస్తులను ఆదుకోవాలన్నారు.అందరూ సన్మార్గంలో నడిచే విధంగా మంచి సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాటంశెట్టి సూర్యచంద్ర విజ్ఞప్తి చేశారు.

## తామరాడలో ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం.



**-ముఖ్యఅతిథిగా పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్.**

**కిర్లంపూడి,పెన్ పవర్ ఫిబ్రవరి 13:** సమాజంలో స్త్రీ పాత్ర చాలా గొప్పదని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. కిర్లంపూడి మండలం రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి గుణశేఖర్ అధ్యక్షతన తామరాడ గ్రామంలో జరిగిన జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ

భారతదేశంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న జరుపుకుంటారన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి, 'భారత కోకిలగా పిలవబడే సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు.

మహిళా సాధికారతను ప్రోత్సహించడం సామాజిక మార్పులో మహిళల పాత్రను గుర్తించడం భూమితో పాటుగా సమస్త ప్రకృతిని స్త్రీ మూర్తిగా ఆరాధిస్తూ గౌరవిస్తారన్నారు. మన భారతీయులు మాతృదేవోభవ అని దైవంగా పూజిస్తాం మహిళలకు సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే వారు రాణించని రంగం అంటూ ఉండదటే అతిశయోక్తి కాదన్నారు. తల్లిగా, చెల్లిగా గృహిణిగా ఆమె అందించే సేవలు అమూల్యమైనవి కుటుంబ సభ్యురాల నుండి సమాజ నాయకురాలి వరకు మహిళలు పాత్ర అభినందనీయమన్నారు.మ హిళలకు దుస్సాలవా కప్పి సన్మానం చేసి స్వీట్ బాక్సు అందజేసారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వానికి మానవత్వం లేదు : మాజీ స్పీకర్ తమ్మినేని



- రాబోయే రోజుల్లో రెండింతల బదులు తీసుకుంటాం :
- జై భీమ్ భారత్ పార్టీ జడ శ్రావణ్ కుమార్
- సెంట్రల్ జైల్లో అంబటిని ములాఖాత్ లో కలిసిన అనంతరం మీడియా తో

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 13:**ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం పాలన సాగించాల్సిన ప్రజా ప్రభుత్వాలు దాడులతో , అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాలను భయపెట్టాలని చూస్తే భయపడేది లేదని మాజీ స్పీకర్, వైసిపి నాయకుడు తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు. గురువారం సెంట్రల్ జైల్లో రిమాండ్ లో ఉన్న అంబటి రాంబాబును ములాఖాత్ లో తమ్మినేని సీతారాం, జై భీమ్ భారత్ పార్టీ జడ శ్రావణ్ కుమార్ , మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ కలిసిన అనంతరం మీడియా కలిశారు. జైలు బయట మీడియాతో సీతారాం మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలు కూటమి పార్టీలకు 164 సీట్లు ఇచ్చింది ప్రతిపక్షాలను అణిచి వేయడానికా, పరిపాలన సాగించడానికా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదని, కుటమీ ప్రభుత్వం పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రజల హక్కులు కాపాడుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదిగా, మాజీ మంత్రిగా అంబటి ని పరామర్శించినట్లు తెలిపారు. 70 సంవత్సరాల వయసున్న మంత్రిపై 53 కేసులు పెట్టి అక్రమంగా జైల్లో పెట్టడం దారుణమని, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. అధికారం శాశ్వతం కాదని నేటి రెడ్ బుక్కు స్థానంలో రాబోయే రోజుల్లో బ్లూ బుక్ వస్తుందని , రెండింతలు బదులు తీసుకుంటామన్నారు. వైసీపీ పార్టీ పరిస్థితి ఇలా ఉంటే చిన్న పార్టీల పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్ బుక్కు రాజ్యాంగం అమలవుతుందని విమర్శించారు. అంబటి ఇంటి పైన దాడులు చేసి వృద్ధులు, మహిళలు భయభ్రాంతులకు గురిచేయడం అమానుషమన్నారు. వీరుతోపాటు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఉన్నారు.

# మహిళల సాధికారతకు దోహదం

గంగవరం మండలంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాల ప్రారంభం





**గంగవరం, పెన్ పవర్,ఫిబ్రవరి 13:**గంగవరం మండలంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం గిరికిరణం ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా గంగవరం, నెల్లిపూడి, జగ్గంపాలెం గ్రామాల్లో శిక్షణ కేంద్రాలను ఘనంగా ప్రారంభించారు.

గంగవరం కేంద్రాన్ని వైస్ ఎంపీపీ గంగాదేవి ప్రారంభించగా, నెల్లిపూడి గ్రామంలో సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ కనకలక్ష్మి చేతుల మీదుగా శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. జగ్గంపాలెం గ్రామంలో సర్పంచ్ లీలారత్నం, ఎంపీటీసీ పద్మావతి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ టి. వెంకటరమణ, డైరెక్టర్ ఏ. రత్నం (బేబి) మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్వయం ఉపాధి మార్గంలో ముందడుగు వేయగలరని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా గ్రామీణ మహిళలు తమ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకునే అవకాశం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్లు నాగ శేషమ్మ, సత్తిపండు, కల్పన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ మోర్చా నూతన కమిటీ నియామకం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 13:** తూర్పుగోదావరి జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా నూతన కమిటి కి మోర్చ జిల్లా అధ్యక్షులు తగరం సురేష్ బాబు జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో గురువారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఇచ్చేది బిజెపి పార్టీ అని,దళిత సోదరుల అభివృద్ధికి, సంక్షేమానికి అనేక పథకాలు బిజెపి పార్టీ ప్రవేశపెట్టిందన్నారు. బిజెపి పార్టీలో కి మరింత మంది దళితూలు చేరడానికి ప్రస్తుత ఎస్సీ మోర్చా నూతన కమిటీ ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సంక్షేమ ఫలాలను అందించేలా కమిటీ కార్యాచరణ ఉండాలని బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు పిక్కి నాగేంద్ర కోరారు.

# నాయకత్వ పటిష్టతతో క్షేత్రస్థాయి లో పార్టీ బలోపేతం



**శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 13:**తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన శాస్త్రీయ వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబుపిలుపునిచ్చారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీని జాతీయ స్థాయిలో రాజకీయ యంత్రాంగంగా నిలబెట్టడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, యువ నాయకుడు నారా లోకేష్ అకుంఠిత దీక్ష ప్రధాన పాత్ర పోషించాయని పేర్కొన్నారు. అత్యుత్తమ పార్టీ నిర్మాణం టీడీపీకి ప్రత్యేకమైన, శాస్త్రీయమైన మరియు క్రమబద్ధమైన సంఘటనా నిర్మాణం ఉందని సత్తిబాబు వివరించారు. ఇతర పార్టీలతో పోలిస్తే క్షేత్రస్థాయిలో టీడీపీ వ్యవస్థ మరింత పటిష్టంగా ఉందన్నారు. క్లస్టర్ -- యూనిట్ -- బూత్ వ్యవస్థ:

గ్రామ స్థాయి నుంచి పై స్థాయి వరకు సమన్వయంతో పనిచేసే విధంగా ప్రత్యేక నిర్మాణాన్ని రూపొందించారని తెలిపారు. కుటుంబ సాధికార సారథి వ్యవస్థ తో ప్రతి 60 ఓట్లకు కె.ఎస్.ఎస్. నియామకం ద్వారా ఇంటింటికీ పార్టీచేరువవు తోందన్నారు. బూత్, యూనిట్ ఇంఛార్జ్ వ్యవస్థ: ప్రతి 1000 ఓట్లకు ఒక బూత్ ఇంఛార్జ్, ప్రతి 5000 ఓట్లకు యూనిట్ ఇంఛార్జ్ నియామకం ద్వారా పర్యవేక్షణను మరింత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల నాయకత్వమే కీలక బలం ఈ పటిష్టమైన వ్యవస్థను విజయవంతం చేయడంలో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల బాధ్యత అత్యంత కీలకమని స్పష్టం చేశారు. నాయకత్వం ఇచ్చిన ఈ అద్భుతమైన స్ట్రక్చర్‌ను సమర్థంగా అమలు చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని విజయాలను సాధించేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపు నిచ్చారు. చంద్రబాబు విజన్, లోకేష్ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ వల్లనే టీడీపీ నేడు శక్తివంతమైన కేడర్ బేస్డ్ పార్టీగా నిలిచింది. ఈ నిర్మాణాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మండల నాయకత్వానిదేనని కుడుపూడి సత్తిబాబు పేర్కొన్నారు.

## బూరుగుపూడి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ..



**– ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి..**

**కోరుకొండ,పెన్ పవర్, ఫిబ్రవరి 13:** కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన పలువురికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధిచెక్కులను శుక్రవారం ఉదయం జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులతో కలిసి 1.దాండ్రు సత్యనారాయణకి 49,578,2.సేసెట్టి ప్రవీణ్ కుమార్ కి రూ. 40,000,3.బొర్రా మాధవికి 60,508 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్, ముని, నాగేంద్ర, కట్ట వీర సూరి,చిన్న బుజ్జి,జనసేన, తెలుగుదేశం , బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరగాపాడులోజనసేన స్థూపం ఆవిష్కరణ. సువర్ణ రాజు.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 13.** నియోజకవర్గంలోని గోపాలపురం మండలం కరగ పాడు గ్రామంలో శనివారం జరగనున్న సమావేశానికి జనసైనికులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డి గర్ల సువర్ణ రాజు ఒక ప్రకటనలో కోరారు. కరకపాడు గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ స్తూపాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్థూపం ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా పార్టీ కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మా ఇరువురి చేతుల మీదుగా స్తూపం ఆవిష్కరణ జరుగుతుందని అనంతరం సమావేశం నిర్వహించ నున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని జనసేన సైనికులు, వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని గ్రామ జనసైనికుల తరుపున సువర్ణ రాజు కోరారు.

## తెలంగాణ బిఆర్ఎస్ కౌన్సిలర్గా రవికిరణ్ గెలుపు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 13** ; తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం మునిసిపల్ ఎన్నికల్లో ఏడో వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కొల్లు రవి కిరణ్ గెలుపొందారు. రవి కిరణ్ సీనియర్ పాత్రికేయులుగా ఆంధ్ర ప్రాంతానికి కూడా సుపరిచితులే. అంతకుముందు కూడా ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. రవి కిరణ్ అంటే యువతకు ఎంతో క్రేజ్. ఎక్కడ సమస్య ఉన్న నేను ఉన్న అంటూ ఆ సమస్యలను పరిష్కరించే వ్యక్తిగా రవికిరణ్ మననాలు పొందారు. దీనిపై జీలుగుమిల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బొంతు రామారావు, యూనియన్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవు పట్టణ ఎస్సై నాగరాజు.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 13.** జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీమ్ అస్మి, ఐపీఎస్., ఆదేశానుసారాం తాడేపల్లిగూడెం డిఎస్పీ విశ్వనాథ్ పర్యవేక్షణలో, తాడేపల్లిగూడెం పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణం ఎస్వీఆర్ సర్కిల్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను, త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వాహనదారును ఆపి వారి రికార్డులను పరిశీలించారు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు, లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలో ప్రతిరోజు హెల్మెట్ డ్రైవ్ నిర్వహిస్తామని, వాహనదారులు ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి అని, వాహనం యొక్క రికార్డ్స్, లైసెన్స్ కూడా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు, లేనియెడల వారికి భారీ జరిమానా విధిస్తామని తెలిపారు, పట్టణంలో ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి ప్రయాణిస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. ఈ డ్రైవ్ లో ఎస్సై వెంకటరమణ, పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com